# బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009

## పాఠశాల విద్య - ఆంధ్రప్రదేశ్

విద్య మా హక్కు

సర్వ శిక్షా అభియాన్

అందరూ చదవాలి-అందరూ ఎదగాలి

# బాలల ఉచిత, నిర్బంధ
# విద్యా హక్కు చట్టం - 2009 & రాష్ట్ర నిబంధనలు


**ముఖ్య సలహాదారులు**

**శ్రీమతి వి. ఉషారాణి,** ఐ.ఏ.ఎస్.
రాష్ట్ర పథక సంచాలకులు
రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ.), ఆం.ప్ర., హైదరాబాద్

సలహాదారులు : **డా॥ వై. అలీ అక్బర్ బాషా,** అదనపు రాష్ట్ర పథక సంచాలకులు

ఎడిటింగ్ మరియు సంకలనం : **డా॥ బండి సాయన్న,** స్టేట్ సి.ఎం.ఓ., ఆర్.వి.ఎం.(ఎస్.ఎస్.ఏ.)
**డా॥ జి. శంకర్,** అసిస్టెంట్ సి.ఎం.ఓ. & **డా॥ జి. త్రివేణి**

సహకారం : **శ్రీ ఎం. నారాయణ & శ్రీ జి. పరుశురాం**

---

ప్రచురణ : కమ్యూనిటి మొబిలైజేషన్ విభాగం
రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), ఆం.ప్ర., హైదరాబాద్

చిరునామా : రాష్ట్ర పథక సంచాలకుల వారి కార్యాలయం,
లాల్ బహదూర్ స్టేడియం ఎదురుగా,
ఎస్.సి.ఇ.ఆర్.టి. ప్రాంగణం, హైదరాబాద్ - 500 001
Phone : +91-40-2324 3525, Fax : 91-40-2329 9098
Website : https://www.rvm.ap.nic.in, E-mail : apssahyd@yahoo.co.in

ముద్రణ : నవంబర్, 2013
టోల్ ఫ్రీ నెం. : 1800 425 3525
డిటిపి & కవర్ డిజైన్: శ్రీనివాస్ మోని
ముద్రణ సంఖ్య : 8,000
ముద్రణాలయం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం

# భారత రాజపత్రం

## అసాధారణ సంచిక

**భాగం - II : ఖండం - I**

అధీకృత ప్రచురణ

నెం. 39, కొత్త ఢిల్లీ, గురువారం, ఆగస్టు 27, 2009

చట్టం, న్యాయ మంత్రిత్వ శాఖ

చట్ట విభాగం

కొత్త ఢిల్లీ, 27 ఆగస్టు, 2009

పార్లమెంటు చేసిన ఈ దిగువ చట్టం 2009, ఆగస్టు 26న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ప్రజల సమాచారం నిమిత్తం ఇక్కడ ప్రచురిస్తున్నాం.

# బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం - 2009

# 35 ఆఫ్ 2009

(26 ఆగస్టు, 2009)

ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల బాలలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించడానికి ఉద్దేశించిన చట్టం.

భారతదేశ 60 వ గణతంత్రపు సంవత్సరంలో పార్లమెంటు చట్టం రూపొందించటానికి : –

# అధ్యాయం - I

## ఉపోద్ఘాతం

### క్లుప్తంగా పేరు, పరిధి, అమలు తేదీ

1. 1) ఈ చట్టాన్ని బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, ఆగస్టు 2009గా పిలవవచ్చు.

   2) ఒక్క జమ్ము & కాశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి ఇది భారతదేశమంతటికీ వర్తిస్తుంది.

   3) కేంద్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుండి ఇది అమలులోకి వస్తుంది.

### నిర్వచనాలు :

2. సందర్భంలో వేరుగా ఉదహరిస్తే తప్పించి చట్టంలోని పదాల అర్థాలు :

   ఎ) "సంబంధిత ప్రభుత్వం" అంటే–

   i) కేంద్ర ప్రభుత్వం ప్రారంభించి, దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో ఉన్న బడులకు శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం;

   ii) సబ్ క్లాజ్ (i) లో సూచించిన బడులు కాకుండా ఇతర బడులకు–

   A) ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం;

   B) శాసనసభ ఉన్న కేంద్ర పాలితప్రాంతంలో ఉంటే ఆ కేంద్రపాలిత ప్రభుత్వం;

   బి) "కాపిటేషన్ రుసుం" అంటే బడి ప్రకటించిన రుసుం కాకుండా ఇతర రూపాలలో ఇచ్చే చందా, విరాళం, చెల్లింపులు;

   సి) "బాలలు" అంటే 6–14 సంవత్సరాల బాల, బాలికలు;

   డి) "ప్రతికూల పరిస్థితులలో ఉన్న బృందాలకు చెందిన బాలలు" అంటే షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగ, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం, లేదా సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా పేర్కొన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భౌగోళిక, భాషాపర, లింగ లేదా ఏ ఇతర కారణాల వల్లనైనా గాని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇతర బృందాలకు చెందిన బాలలు;

ఇ) "బలహీన వర్గాలకు చెందిన బాలలు" అంటే సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా పేర్కొన్న కనీస మొత్తం కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న తల్లిదండ్రుల లేదా సంరక్షకులకు చెందిన బాలలు;

ఎఫ్) "ప్రాథమిక విద్య" అంటే ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్య;

జి) బాలలకు సంబంధించిన "సంరక్షకులు" అంటే ఆ బాలుడు/ బాలిక సంరక్షణ బాధ్యత, కస్టడీ కలిగి ఉన్న వ్యక్తి వీళ్ళు సహజ సంరక్షకులు కావచ్చు, కోర్టు లేదా చట్టపరంగా ప్రకటించబడిన లేదా నియమించబడిన సంరక్షకులు కావచ్చు;

హెచ్) "స్థానిక ప్రభుత్వం" అంటే నగరపాలక సంస్థ, లేదా నగర పాలక సంఘం లేదా జిల్లాపరిషత్ లేదా నగర పంచాయతీ లేదా పంచాయతీ, ఏ పేరుతో పిలవబడినప్పటికీ బడిమీద పరిపాలనా సంబంధ నియంత్రణ కలిగిన సంస్థను సూచిస్తుంది. లేదా అమలులో ఉన్న చట్టం ప్రకారం ఏదైనా గ్రామ, పట్టణ నగరంలో స్థానిక ప్రభుత్వంగా పనిచెయ్యటానికి అధికారం పొందిన సంస్థను సూచిస్తుంది;

## 4 ఆఫ్ 2006 :

ఐ) "బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమిషన్" అంటే బాలల హక్కుల సంరక్షణకు కమిషన్ల చట్టం, 2005లోని సెక్షన్-3 ప్రకారం ఏర్పాటుచేయబడిన బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమీషన్;

జె) "ప్రకటన" అంటే అధికారిక రాజపత్రంలో ప్రచురించిన ప్రకటన

కె) "తల్లిదండ్రులు" అంటే బాలల సహజ, సవతి లేదా దత్తత తీసుకున్న తల్లి లేదా తండ్రి.

ఎల్) "సిఫారసు చేసిన" అంటే ఈ చట్టం కింద సిఫారసు చేసిన నియమాలు

ఎం) "షెడ్యూల్" అంటే ఈ చట్టానికి అనుబంధంగా ఇచ్చిన షెడ్యూల్

ఎన్) "బడి" అంటే ఈ చట్టం కింద సిఫారసు చేసిన నియమాలు కలిగినది.

i) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న బడి.

ii) తన ఖర్చులో మొత్తం గానీ, కొంత భాగం గానీ సహాయంగా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి పొందుతున్న ఎయిడెడ్ పాఠశాల.

iii) ప్రత్యేక వర్గీకరణకు చెందిన బడి.

iv) తన ఖర్చులకు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం పొందని అన్ ఎయిడెడ్ పాఠశాల.

ఓ) "బడిలో ప్రవేశానికి ఎంపిక విధానం" అంటే ర్యాండమ్ పద్ధతిని మినహాయించి ఒకరిని కాకుండా వేరొకరిని బడిలో చేర్చుకోవటానికి నిర్వహించే ఎంపిక లేదా ప్రవేశ విధానం.

పి) బడికి సంబంధించి "ప్రత్యేక వర్గీకరణ" అంటే కేంద్రీయ విద్యాలయ, నవోదయ విద్యాలయ, సైనిక్ పాఠశాల వంటివి లేదా సంబంధిత ప్రభుత్వ ప్రకటన ద్వారా విశిష్ట లక్షణం ఉందని పేర్కొనబడిన ఇతర బడులు.

క్యూ) "బాలల సంరక్షణకు రాష్ట్ర కమీషన్" అంటే బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టం – 2005లోని సెక్షన్ 3 కింద ఏర్పాటుచేయబడిన బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్.

# అధ్యాయం - II

## ఉచిత, నిర్బంధ విద్యా హక్కు

### బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు

3. 1) ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాలు ఉన్న బాలలందరికీ పరిసర ప్రాంత పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసేవరకు ఉచిత, నిర్బంధ విద్య పొందే హక్కు ఉంటుంది.

2) సబ్ సెక్షన్ (1)లో పేర్కొన్నట్లు ప్రాథమిక విద్యను చేపట్టి పూర్తిచెయ్యటానికి అవరోధకంగా ఉండే ఎటువంటి రుసుము, ఛార్జీలు, ఖర్చులను చెల్లించాల్సిన అవసరం బాలలకు లేదు.

### 1 ఆఫ్ 1996 :

అయితే సమాన అవకాశాలు, సంరక్షణ, పూర్తి భాగస్వామ్య చట్టం, 1996 లోని సెక్షన్-2, క్లాజ్ (i) లో నిర్వచించిన ప్రకారం వైకల్యంతో బాధపడుతున్న బాలలు ఆ చట్టంలోని అధ్యాయం (v) లో పేర్కొన్న ప్రకారం ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను పొందే హక్కును కలిగి ఉంటారు.

### ప్రాథమిక విద్యలో నమోదు చేయించుకోని లేదా పూర్తి చేయని బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు :

4. ఆరు ఏళ్ళు నిండిన బాలుడు/ బాలికను బడిలో చేర్చకపోయినా, లేదా చేర్చిన తరువాత ప్రాథమిక విద్యను పూర్తి చెయ్యలేకపోయినా వారిని వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చుకోవాలి;

అయితే, తమ వయసుకు తగిన తరగతిలో ప్రవేశం పొందిన బాలలు తోటివారితో సమానంగా ఉండటానికి సిఫారసు చేసిన పద్ధతిలో, సిఫారసు చేసిన కాలపరిధిలో ప్రత్యేక శిక్షణ పొందే హక్కు కలిగి ఉంటారు.

అయితే, ఈవిధంగా ప్రాథమిక విద్యలోకి ప్రవేశం పొందిన బాలలు పద్నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన తరువాత కూడా ప్రాథమిక విద్యను పూర్తిచేసేవరకు ఉచిత విద్యను పొందే హక్కు కలిగి ఉంటారు.

## వేరే బడికి బదిలీ హక్కు

5. 1) ఒక బడిలో ప్రాథమిక విద్యను పూర్తి చేసే సదుపాయం లేకపోతే సెక్షన్-2, క్లాజు (n)లోని, సబ్ క్లాజులు (iii), (iv) లలో పేర్కొన్న బడులను మినహాయించి తమ ప్రాథమిక విద్యను పూర్తిచెయ్యటానికి ఏ ఇతర బడికైనా బదిలీ కోరే హక్కు ఉంటుంది.

2) అదే రాష్ట్రంలో కాని, రాష్ట్రం బయట కాని ఏ కారణం వల్లనైతేనేమి ఒక బడినుంచి మరొక బడికి బాలలు మారవలసి వచ్చినప్పుడు సెక్షన్ (n)లోని, సబ్ క్లాజులు (iii), (iv) లలో పేర్కొన్న బడులను మినహాయించి తమ ప్రాథమిక విద్యను పూర్తి చెయ్యటానికి ఏ ఇతర బడికైనా బదిలీ కోరే హక్కు ఉంటుంది.

3) ఇలా వేరే బడిలో ప్రవేశం పొందడానికి అప్పటివరకు చదివిన బడి ప్రధానోపాధ్యాయులు లేదా బడి ఇన్‌చార్జి వెంటనే బదిలీ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాలి;

అయితే, బదిలీ ధృవీకరణ పత్రం ఇవ్వటం ఆలస్యం అయ్యిందన్నది వేరే బడిలో ప్రవేశం ఇవ్వకపోవటానికి, ఆలస్యంగా చేర్చుకోవటానికి కారణంగా చూపటానికి లేదు;

అయితే, ధృవీకరణ పత్రం ఇవ్వటంలో జాప్యానికి కారణమైన ప్రధానోపాధ్యా యులు లేదా బడి ఇన్‌చార్జి, వారికి వర్తించే నియమాల ప్రకారం క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు అవుతారు.

# అధ్యాయం - III

## సంబంధిత ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతలు

### బడిని స్థాపించడం, సంబంధిత స్థానిక ప్రభుత్వ బాధ్యత

6. ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటానికి సిఫారసు చేసిన పరిసర ప్రాంత పరిధిలో బడి లేకపోతే ఈ చట్టం అమలులోకి వచ్చిన మూడు సంవత్సరాల లోపు సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం బడిని స్థాపిస్తుంది.

### ఆర్థిక, ఇతర బాధ్యతలను పంచుకోవడం

7. 1) ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటానికి నిధులను సమకూర్చే బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమానంగా ఉంటుంది.

   2) ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటానికి అవసరమయ్యే ఒక్కసారి చేసే పెట్టుబడి ఖర్చులను, ప్రతి సంవత్సరం అయ్యే నిర్వహణ ఖర్చులను కేంద్రప్రభుత్వం అంచనావేస్తుంది.

   3) పై సబ్ సెక్షన్ (2)లో పేర్కొన్న ఖర్చులో కొంతశాతాన్ని రాష్ట్రప్రభుత్వాలతో చర్చించి ఎప్పటికప్పుడు నిర్ధారించిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా అందజేస్తుంది.

   4) చట్టంలోని అంశాలను అమలుచెయ్యటానికి అవసరమయ్యే తనవంతు నిధులను అందచెయ్యటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికి అయినా అదనపు వనరుల అవసరాన్ని పరిశీలించటానికి ఆర్టికల్-280లోని క్లాజు (3), సబ్ క్లాజ్ (d) ప్రకారం ఆర్థిక సంఘాన్ని సంప్రదించవలసిందిగా రాష్ట్రపతిని కేంద్ర ప్రభుత్వం కోరవచ్చు.

   5) పై సబ్ సెక్షన్ (4)లో చెప్పిన దానితో సంబంధం లేకుండా, సబ్ సెక్షన్ (3)లో కేంద్ర ప్రభుత్వం అందజేసిన మొత్తాలను, తన ఇతర వనరులను పరిగణనలోకి తీసుకుని ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి అవసరమైన నిధులను అందజెయ్యటానికి రాష్ట్రప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.

6) కేంద్రప్రభుత్వం–

ఎ) సెక్షన్ 29లో పేర్కొన్న అకడెమిక్ అథారిటీ సహాయంతో జాతీయ పాఠ్యప్రణాళిక చట్రాన్ని తయారుచేస్తుంది;

బి) టీచర్ల శిక్షణకు ప్రామాణికాలను రూపొందించి, అమలు అయ్యేలా చూస్తుంది;

సి) కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రణాళిక తయారీ, సామర్థ్యం పెంపుదలను ప్రోత్స హించటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక మద్దతును, వనరులను అందజేస్తుంది.

## సంబంధిత ప్రభుత్వ బాధ్యతలు

8. సంబంధిత ప్రభుత్వం–

ఎ) బాలలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అందజేస్తుంది;

అయితే, ఎవరైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ బిడ్డను సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించిన దాని యాజమాన్యం లేదా నియంత్రణలో లేని బడిలో కాని, ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ పెద్దమొత్తంలో నిధులు అందించని బడిలో కాని, చేర్పించినట్లయితే అటువంటి బడిలో తమ బిడ్డకు ప్రాథమిక విద్య చెప్పించినందుకు పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించమని అడిగే హక్కు ఉండదు.

**వివరణ :** "నిర్బంధ విద్య" అంటే సంబంధిత ప్రభుత్వం కింది వాటికి బాధ్యత వహించటం–

i) ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల వయస్సు ఉన్న బాలలందరికి ఉచితంగా ప్రాథమిక విద్యను అందించడం;

ii) ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల వయస్సు ఉన్న బాలలు తప్పనిసరిగా బడిలో చేరి, బడికి హాజరవుతూ, ప్రాథమిక విద్యను పూర్తిచేసేలా చూడటం;

బి) సెక్షన్–6లో పేర్కొన్న విధంగా పరిసర ప్రాంతంలో బడి అందుబాటులో ఉండేలా చూడడం;

సి) బలహీనవర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏవిధమైన వివక్షతకు గురికాకుండా, ప్రాథమిక విద్యను చేపట్టి, పూర్తిచెయ్యటంలో ఏ కారణంగా కూడా ఆటంకాలు లేకుండా చూడటం;

డి) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

ఇ) సెక్షన్–4లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

ఎఫ్) ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక బడిలో ప్రవేశం పొంది, హాజరు అవుతూ, ప్రాథమిక విద్యను పూర్తిచేసేలా చూడటం;

జి) షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలకు అనుగుణంగా నాణ్యమైన ప్రాథమిక విద్య అందుబాటులో ఉండేలా చూడడం;

హెచ్) ప్రాథమిక విద్యకు పాఠ్య ప్రణాళికను, కోర్సులను సకాలంలో సిఫారసు చేయటం;

ఐ) టీచర్లకు శిక్షణా సౌకర్యం కల్పించటం.

## స్థానిక ప్రభుత్వ బాధ్యతలు :

9. ప్రతి స్థానిక ప్రభుత్వం–

ఎ) బాలలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అందజేస్తుంది;

అయితే, ఎవరైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ బిడ్డను సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి, దాని యాజమాన్యం లేదా నియంత్రణలో లేని బడిలో కాని, ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ పెద్దమొత్తంలో నిధులు అందించని బడిలో కాని, చేర్పించినట్లయితే అటువంటి బడిలో తమ బిడ్డకు ప్రాథమిక విద్య చెప్పించినందుకు పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించమని అడిగే హక్కు ఉండదు.

బి) సెక్షన్–6లో పేర్కొన్న విధంగా పరిసరప్రాంతంలో బడి అందుబాటులో ఉండేలా చూడడం;

సి) బలహీనవర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏవిధమైన వివక్షతకు గురికాకుండా, ప్రాథమిక విద్యను చేపట్టి, పూర్తిచెయ్యటంలో ఏ కారణంగా కూడా, ఆటంకాలు లేకుండా చూడటం;

డి) సిఫారసు చేసిన విధంగా తమ పరిధిలో నివసిస్తున్న పద్నాలుగేళ్ళ లోపలి బాలలందరి రికార్డులను నిర్వహించడం;

ఇ) ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక బడిలో ప్రవేశం పొంది, హాజరు అవుతూ, ప్రాథమిక విద్యను పూర్తిచేసేలా పర్యవేక్షించటం;

ఎఫ్) పాఠశాల భవనం, బోధనాసిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

జి) సెక్షన్–4లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

హెచ్) షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలకు అనుగుణంగా నాణ్యమైన ప్రాథమిక విద్య అందుబాటులో ఉండేలా చూడడం;

ఐ) ప్రాథమిక విద్యకు పాఠ్యప్రణాళికను, కోర్సులను సకాలంలో సిఫారసు చేయటం;

జె) టీచర్లకు శిక్షణా సౌకర్యం కల్పించటం;

కె) వలస కుటుంబాల పిల్లలు బడిలో ప్రవేశం పొందేలా చూడటం;

ఎల్) తమ పరిధిలోని బడుల పనితీరును పర్యవేక్షించటం;

ఎం) విద్యా క్యాలెండర్‌ను నిర్ణయించడం.

## తల్లిదండ్రులు, సంరక్షకుల బాధ్యతలు

10. తమ బిడ్డ, లేదా సంరక్షణలో ఉన్న బాలుడు/ బాలికను పరిసర ప్రాంతంలోని ప్రాథమిక విద్యలో చేర్పించడం ప్రతి తల్లిదండ్రి లేదా సంరక్షకుని బాధ్యత.

## పూర్వపాఠశాల విద్యను సంబంధిత ప్రభుత్వం అందించాలి

11. మూడు సంవత్సరాలకు మించిన బాలలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చెయ్యటాకి, ఆరేళ్ళు నిండేవరకు బాలలందరికీ శైశవదశ సంరక్షణ, విద్య అందించటానికి ఇటువంటి పిల్లలకు ఉచిత పూర్వ పాఠశాల విద్యను అందించటానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత ప్రభుత్వం చెయ్యాలి.

# అధ్యాయం - IV

## బడులు, టీచర్ల బాధ్యతలు

### ఉచిత నిర్బంధ విద్యకు బడుల బాధ్యత, పరిధి

12. 1) ఈ చట్టం సంబంధించినంత వరకు,

ఎ) సెక్షన్ 2, క్లాజ్ (n), సబ్ క్లాజ్ (i)లో పేర్కొన్న బడులు ప్రవేశం ఇచ్చిన బాలలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి.

బి) సెక్షన్ 2, క్లాజ్ (n), సబ్ క్లాజ్ (ii)లో పేర్కొన్న బడులు కనీసం 25 శాతానికి తగ్గకుండా ప్రతి సంవత్సరం నిర్వహణకు అయ్యే ఖర్చులో ఎంతశాతం నిధులను వార్షిక ఎయిడ్ లేదా గ్రాంటుగా పొందుతున్నాయో బడిలో చేర్చుకున్న పిల్లల్లో అంత శాతం మందికి ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి.

సి) సెక్షన్–2, క్లాజ్ (n), సబ్ క్లాజ్ (ii–)లో పేర్కొన్న బడులు పరిసర ప్రాంతాలకు చెందిన బలహీనవర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన బాలలకు ఒకటవ తరగతిలోని విద్యార్థుల సంఖ్యలో 25 శాతం ఇచ్చి ప్రాథమిక విద్య పూర్తిచేసేంతవరకు ఉచిత, నిర్బంధ విద్యను అందజేయాలి.

సెక్షన్–2, క్లాజు (n)లో పేర్కొన్న బడులలో పాఠశాల పూర్తి విద్యను అందజేస్తున్నట్లయితే పైన పేర్కొన్న (ఎ) నుంచి (సి) క్లాజులలోని అంశాలు పూర్వ పాఠశాలలో ప్రవేశానికీ వర్తిస్తాయి.

2) సెక్షన్–2, క్లాజ్ (n), సబ్ క్లాజు (iv) లో పేర్కొన్న బడులు సబ్ సెక్షన్ (1), క్లాజ్ (సి) లో పేర్కొన్న విధంగా ఉచిత, నిర్బంధ విద్యను అందజేస్తున్నట్టయితే అది చేసిన ఖర్చును తిరిగి పొందవచ్చు. ప్రతి బాలుడు/ బాలికపై రాష్ట్రం పెట్టే ఖర్చుకి లేదా వాస్తవంగా విద్యార్థి నుంచి వసూలు చేసిన మొత్తానికి ఏది తక్కువైతే అది, సిఫారసు చేసిన పద్ధతి ప్రకారం లోబడి చెల్లింపులు చేస్తారు;

అయితే సెక్షన్–2 క్లాజ్ (n), సబ్‌క్లాజ్ (i)లో పేర్కొన్న బడిలో ఒక బాలుడు/ బాలికపై

అయిన ఖర్చుకు మించి ఇటువంటి చెల్లింపులు ఉండకూడదు.

అయితే, ఏ బడి అయిన భూమి, భవనం, పరికరాలు, ఇతర సదుపాయాలను పూర్తి ఉచితంగా కానీ లేదా రాయితీ ధరపై కానీ పొంది ఉండి నిర్ధారిత సంఖ్యలో పిల్లలకు ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటే ఆ బాధ్యత వర్తించేవరకు చేసిన ఖర్చులకు తిరిగి చెల్లింపులు పొందే అర్హత ఉండదు.

3) సందర్భాన్ని బట్టి సంబంధిత ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రభుత్వానికి అవసరమయ్యే సమాచారాన్ని ప్రతి బడి అందించాలి.

## బడిలో ప్రవేశానికి ఎంపిక విధానం, క్యాపిటేషన్ రుసుం ఉండకూడదు

13. 1) బాలుడు/ బాలికను బడిలోకి చేర్చుకోవటానికి బడిగానీ లేదా ఎవరైనా వ్యక్తిగానీ క్యాపిటేషన్ రుసం వసూలు చెయ్యకూడదు, బాలుడు/బాలికను లేదా వారి తల్లిదండ్రులను లేదా వారి సంరక్షకులను ఎటువంటి ఎంపిక విధానానికి గురి చెయ్యకూడదు.

2) సబ్ సెక్షన్ (1)లో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా ఏ బడి అయినా, లేదా వ్యక్తి అయినా–

ఎ) క్యాపిటేషన్ రుసుం వసూలు చేస్తే దానికి పదిరెట్ల వరకు జరిమానాతో శిక్షింపబడవచ్చు.

బి) బాలుడు/ బాలికను ఎంపిక విధానానికి గురిచేస్తే, మొదటిసారి తప్పుకు 25,000 రూపాయలు, ఆ తరువాత ప్రతిసారి తప్పుకు 50,000 రూపాయల జరిమానా విధించవచ్చు.

## 6 ఆఫ్ 2006 - బడిలో ప్రవేశానికి వయస్సు ధృవీకరణ

14. 1) జనన, మరణ, వివాహాల నమోదు చట్టం, 1886లోని అంశాలకు అనుగుణంగా జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం లేదా సిఫారసు చేసిన ఇతర పత్రం ఆధారంగా ప్రాథమిక విద్యలో ప్రవేశానికి బాలుడు/ బాలిక వయస్సును నిర్ధారిస్తారు.

2) వయస్సు నిర్ధారణ చెయ్యలేదన్న కారణంతో ఏ బాలుడు/ బాలికకు బడిలో ప్రవేశాన్ని తిరస్కరించకూడదు.

## బడిలో ప్రవేశాన్ని తిరస్కరించకూడదు

15. 1) విద్యాసంవత్సరం మొదలు అయినప్పుడు లేదా సిఫారసు చేసిన గడువు పెంచిన కాలంలోపు బాలలను బడిలో చేర్చుకోవాలి.

అయితే, పెంచిన గడువు తరువాత బాలుడు/ బాలిక ప్రవేశం కోరితే దానిని తిరస్కరించకూడదు.

అయితే, గడువు తరువాత ప్రవేశం పొందిన బాలలు సంబంధిత ప్రభుత్వం సిఫారసు చేసినవిధంగా తమ చదువును పూర్తిచెయ్యాలి.

## అదే తరగతిలో మళ్ళీ కొనసాగించడం, బడినుంచి తీసివెయ్యడం నిషేధం

16. బడిలో ప్రవేశం పొందిన బాలలను ప్రాథమిక విద్య పూర్తి అయ్యేవరకు ఏ తరగతిలోనైనా మళ్ళీ కొనసాగించకూడదు. బడినుంచి తీసివెయ్యకూడదు

## బాలలను శారీరకంగా శిక్షించటం, మానసికంగా వేధించటం నిషేధం

17. 1) ఏ బాలుడు/ బాలికను కూడా శారీరక శిక్షకు, మానసిక వేధింపులకు గురిచెయ్యకూడదు.

2) పై సబ్ సెక్షన్ (1)లోని అంశాలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు ఆ వ్యక్తికి వర్తించే ఉద్యోగ నియమాల ఆధారంగా క్రమశిక్షణ చర్యకు గురౌతారు.

## గుర్తింపు ధృవీకరణ పత్రం లేకుండా బడిని ప్రారంభించకూడదు

18. 1) ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి, దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో నడిచే బడి తప్పించి సిఫారసు చేసినవిధంగా, పద్ధతిలో దరఖాస్తు చేసుకుని సంబంధిత అధీకృత సంస్థనుంచి గుర్తింపు ధృవీకరణ పత్రం పొందకుండా ఏ ఇతర బడిని స్థాపించకూడదు, పనిచెయ్యకూడదు.

2) సిఫారసు చేసినవిధంగా తగిన విధంలో, నిర్ణీత గడువులో తగిన పద్ధతులలో షరతులు విధిస్తూ గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని సబ్ సెక్షన్ (1) ప్రకారం అధీకృతమైన సంస్థ జారీ చేస్తుంది.

అయితే, సెక్షన్ 19లో నిర్దేశించిన నియమాలు, ప్రామాణికాలను పూర్తిచేసేవరకు బడికి ఇటువంటి గుర్తింపు జారీ చెయ్యకూడదు.

3) గుర్తింపు ఇస్తూ విధించిన షరతులను ఉల్లంఘిస్తే సంబంధిత అధీకృత సంస్థ లిఖితపూర్వక ఆదేశాల ద్వారా గుర్తింపును ఉపసంహరించుకోవచ్చు.

అయితే, గుర్తింపు రద్దుచేస్తున్న బడిలో చదువుతున్న బాలలను ఏ పరిసర ప్రాంత బడిలో చేర్చుకోవాలో ఆ ఆదేశాలలో పేర్కొనాలి.

అయితే, గుర్తింపు రద్దు చెయ్యబోయే బడి వాదనను సిఫారసు చేసినవిధంగా, సిఫారసు చేసిన పద్ధతిలో వినకుండా గుర్తింపును రద్దు చెయ్యకూడదు.

4) సబ్ సెక్షన్ (3) కింద గుర్తింపు రద్దు అయిన తేదీనుండి ఆ బడి పనిచెయ్యకూడదు.

5) గుర్తింపు ధృవీకరణ పొందకుండా ఏ వ్యక్తి అయినా బడి స్థాపించినా, నడిపినా లేదా గుర్తింపు రద్దు అయిన తరువాత కూడా బడిని నడిపినా లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఒకవేళ ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే అలాంటి కాలానికి ప్రతిరోజుకి పదివేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

## బడులకు నియమాలు, ప్రామాణికాలు

19\. 1) షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలు పూర్తిచెయ్యకుండా సెక్షన్ 18 కింద ఏ బడిని ఏర్పాటు చెయ్యకూడదు. గుర్తింపును ఇవ్వకూడదు.

2) ఈ చట్టం ఏర్పడకముందే స్థాపించబడి, నిర్వహింపబడుతున్న బడి షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలను పూర్తిచెయ్యకపోతే చట్టం అమలులోకి వచ్చిన తేదీ నుంచి మూడు సంవత్సరాలలోపు ఈ నియమాలు, ప్రామాణికాలను పూర్తిచెయ్యడానికి తన సొంత ఖర్చులతో చర్యలు చేపట్టాలి.

3) సబ్ సెక్షన్ (2) కింద పేర్కొన్న గడువులోపల నియమాలు, ప్రామాణికాలను బడి పూర్తి చెయ్యటంలో విఫలమయితే సెక్షన్ 18, సబ్ సెక్షన్ (3) కింద పేర్కొన్న పద్ధతిలో, సబ్ సెక్షన్ (1)లో పేర్కొన్న సంబంధిత అధీకృత సంస్థ ఆ బడికి జారీ చేసిన గుర్తింపును రద్దు చెయ్యాలి.

4) సబ్ సెక్షన్ (3) ప్రకారం గుర్తింపు రద్దు చేసిన తేదీ నుంచి ఆ బడి పని చెయ్యకూడదు.

5) గుర్తింపు రద్దు అయిన తరువాత కూడా ఏ వ్యక్తి అయినా బడిని నడిపితే లక్షరూపాయల

వరకు జరిమానా విధించవచ్చు. ఒకవేళ ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే అలాంటి కాలానికి ప్రతి రోజుకి పదివేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

## షెడ్యూల్ సవరణకు అధికారం

20. కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా నియమాలు, ప్రామాణికాలలోంచి ఏదైనా తొలగించడం లేదా కొత్తగా చేర్చటం ద్వారా షెడ్యూల్‌ని సవరించవచ్చు.

## బడి యాజమాన్య సంఘం

21. 1) సెక్షన్-2, క్లాజు (n), సబ్ క్లాజు (iv)లో పేర్కొన్న బడులను మినహాయించి మిగిలిన బడులన్నీ స్థానిక ప్రభుత్వానికి ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో, ఆ బడిలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు, ఉపాధ్యాయులతో బడి యాజమాన్య సంఘాన్ని ఏర్పాటుచెయ్యాలి.

అయితే, ఇటువంటి సంఘంలో నాల్గింట కనీసం మూడు వంతుల సభ్యులు తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు అయి ఉండాలి.

అయితే, బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాల పిల్లల తల్లిదండ్రులు, లేదా సంరక్షకులకు దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం కల్పించాలి.

అయితే, ఈ సంఘ సభ్యులలో 50 శాతం మహిళలు ఉండాలి.

2) బడి యాజమాన్యసంఘం ఈ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

ఎ) బడి పనితీరును పర్యవేక్షించడం.

బి) బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచేసి సిఫారసు చేయటం.

సి) సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం లేదా ఏ ఇతర వనరుల నుండి అయినా అందిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం.

డి) సిఫారసు చేసిన ఇతర నిధులను నిర్వర్తించటం.

## బడి అభివృద్ధి ప్రణాళిక

22. సెక్షన్ 21, సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏర్పడిన ప్రతి బడి యాజమాన్య సంఘం సిఫారసు చేసిన విధంగా బడి అభివృద్ధి ప్రణాళికను తయారుచెయ్యాలి.

2) సందర్భాన్ని బట్టి సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం రూపొందించే ప్రణాళికలకు అందించే గ్రాంట్లకు సబ్ సెక్షన్ (1) ప్రకారం తయారుచేసిన బడి అభివృద్ధి ప్రణాళిక ఆధారం అవుతుంది.

## టీచరుగా నియామకానికి అర్హతలు, ఉద్యోగ షరతులు, నిబంధనలు

23\. 1) కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడెమిక్ సంస్థ నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న ఏ వ్యక్తి అయినా టీచరుగా నియమింపబడటానికి అర్హులు.

2) టీచర్ల శిక్షణలో కోర్సులు లేదా శిక్షణలు అందించే సంస్థలు తగినన్ని లేని రాష్ట్రాలు గానీ, సబ్ సెక్షన్ (1)లో నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న టీచర్లు తగిన సంఖ్యలో అందుబాటులో లేనప్పుడు కానీ అవసరమనుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా టీచరుగా నియమింపబడటానికి కనీస అర్హతలకు మినహాయింపులను ఇవ్వవచ్చు. ఆ ప్రకటనలో పేర్కొన్న కాలానికి లోబడి అయిదేళ్ళకు మించి ఈ మినహాయింపులు ఉండవు.

అయితే, ఈ చట్టం అమలులోకి వచ్చే తేదీ నాటికి సబ్ సెక్షన్ (1)లో నిర్ధారించిన కనీస అర్హతలు లేని టీచరు అయిదు సంవత్సరాల లోపు కనీస అర్హతలను పొందాలి.

3) టీచర్లకు చెల్లించాల్సిన జీత, భత్యాలు వారి ఉద్యోగ షరతులు, నిబంధనలు సిఫారసు చేసిన విధంగా ఉంటాయి.

## టీచర్ల విధులు, సమస్యల పరిష్కారం

24\. 1. సెక్షన్ 23 సబ్ సెక్షన్ (1) ప్రకారం నియమితులైన టీచర్లు ఈ కింద పేర్కొన్న విధులను నిర్వర్తించాలి.

ఎ) బడికి హాజరు కావటంలో సమయాన్ని, క్రమబద్ధతనీ పాటించాలి.

బి) సెక్షన్ 29 సబ్ సెక్షన్ (2) లోని అంశాల ప్రకారం పాఠ్యాంశాలను చేపట్టి, పూర్తి చెయ్యాలి.

సి) నిర్ధారిత సమయంలోపు పాఠ్యాంశాలన్నింటినీ పూర్తి చెయ్యాలి.

డి) ప్రతి బాలుడు/ బాలిక నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేసి, అవసరమైతే దానికి అనుగుణంగా అదనపు బోధనను అందించాలి.

ఇ) తల్లిదండ్రులు, సంరక్షకులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి బాలల

హాజరీలో క్రమబద్ధత, వారు నేర్చుకునే సామర్థ్యం, నేర్చుకోవడంలో వారి ప్రగతి, వారికి సంబంధించిన ఇతర సమాచారాన్ని పంచుకోవాలి.

ఎఫ్) సూచించిన ఇతర విధులను నిర్వర్తించటం.

2. సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న విధులను నిర్వర్తించటంలో టీచరు విఫలమయితే వారికి వర్తించే ఉద్యోగ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యకు గురౌతారు.

అయితే, ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకునే ముందు ఆ టీచరు తన వాదన వినిపించటానికి న్యాయమైన అవకాశాన్ని ఇవ్వాలి.

3. టీచర్లకు ఉండే ఏ సమస్యలనైనా సూచించిన పద్ధతిలో పరిష్కరిస్తారు.

## విద్యార్థి - టీచర్ల నిష్పత్తి

25. 1) చట్టం అమలులోకి వచ్చిన ఆరునెలల లోపు షెడ్యూల్‌లో నిర్ధారించిన విద్యార్థులు - టీచర్ల నిష్పత్తి ప్రతి బడిలోనూ ఉండేలా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం చూడాలి.

2) సబ్ సెక్షన్ (1)లో పేర్కొన్న విద్యార్థి - టీచర్ల నిష్పత్తి ఉండేలా చూడటానికి ఒక బడిలో పోస్టింగ్ ఇచ్చిన టీచరును సెక్షన్ 27లో పేర్కొన్న అంశాలకు మినహాయించి ఇతర బడిలో కానీ, కార్యాలయంలో కానీ పని చేయించకూడదు. విద్యేతర పనుల మీద పంపించగూడదు.

## టీచర్ల ఖాళీలను భర్తీ చేయటం

26. సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి, దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న బడులలో లేదా ప్రత్యక్షంగా, పరోక్షంగా గణనీయమైన నిధులను సమకూర్చే బడులలో ఆమోదం పొందిన మొత్తం టీచర్ల సంఖ్యలో ఖాళీల సంఖ్య పది శాతానికి మించకుండా చూడాలి.

## విద్యేతర పనులకు టీచర్లను పంపటంపై నిషేధం

27. పది సంవత్సరాలకి ఒకసారి జరిగే జనాభా గణన, వైపరీత్యాలలో సహాయ విధులు, లేదా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులను మినహాయించి టీచర్లను ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదు.

## టీచర్ల ప్రైవేట్ ట్యూషన్లపై నిషేధం

28. ఏ టీచరు కూడా ప్రైవేటు ట్యూషన్లను, ప్రైవేటు బోధనా పనులను చేపట్టగూడదు.

# అధ్యాయం - V

## పాఠ్య ప్రణాళిక, ప్రాథమిక విద్యను పూర్తి చెయ్యటం

### పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానం

29. 1) సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడెమిక్ సంస్థ ప్రాథమిక విద్యకు, పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాన్ని నిర్ధారిస్తుంది.

2) సబ్ సెక్షన్ (1) ప్రకారం పాఠ్య ప్రణాళికను, మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటప్పుడు, అధీకృత అకడెమిక్ సంస్థ ఈ క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

ఎ) రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

బి) బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలి.

సి) బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.

డి) బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులు అభివృద్ధి చెందాలి.

ఇ) పిల్లలను కేంద్రంగా చేసుకుని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనటం ద్వారా నేర్చుకోవాలి.

ఎఫ్) ఆచరణకు సాధ్యమైనంతవరకు బోధనా మాధ్యమం బాలల మాతృభాషగా ఉంటుంది.

జి) భయం, ఆందోళన వంటి వాటినుంచి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటంలో సహాయపడాలి.

హెచ్) జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దానిని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర సమగ్ర మూల్యాంకనం చెయ్యాలి.

### పరీక్ష, ప్రాథమిక విద్య పూర్తి అయినట్లు ధృవీకరణ పత్రం

30. 1) ప్రాథమిక విద్య పూర్తి అయ్యేవరకు బాలలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.

2) బాలుడు లేదా బాలిక ప్రాథమిక విద్య పూర్తి చేసిన తరువాత సూచించిన ప్రకారం వారికి తగిన విధానం, పద్ధతిలో ధృవీకరణ పత్రం జారీ చేస్తారు.

# అధ్యాయం - VI

## బాలల హక్కుల సంరక్షణ

### బాలల విద్యా హక్కు సంరక్షణ

31. 1) బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టం, 2005లోని సెక్షన్ 3 కింద ఏర్పడిన బాలల హక్కుల సంరక్షణ జాతీయ కమీషన్ లేదా సందర్భాన్ని బట్టి సెక్షన్ 17 కింద ఏర్పడిన బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్ ఆ చట్టంలో కేటాయించిన విధులకు అదనంగా ఈ దిగువ పేర్కొన్న విధులు కూడా నిర్వర్తిస్తాయి.

    ఎ) ఈ చట్టం కింద లేదా దానికి అనుగుణంగా ఇచ్చిన హక్కులను పరిశీలించి, వాటిని కాపాడే ఏర్పాట్లను సమీక్షించి, ఇవి సమర్థవంతంగా అమలు అయ్యేందుకు చర్యలను సిఫారసు చెయ్యటం.

    బి) ఉచిత, నిర్బంధ విద్యకు బాలలకున్న హక్కుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరపటం.

    సి) పైన పేర్కొన్న బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టంలోని సెక్షన్లు 15, 24లకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవటం.

2) పైన పేర్కొన్న సబ్ సెక్షన్ (1) క్లాజు (సి) కింద ఉచిత, నిర్బంధ విద్యకు బాలలకున్న హక్కుకు సంబంధించి ఏ అంశంలోనైనా విచారణ జరుపుతున్నప్పుడు ఆయా కమీషన్లకు బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టంలోని సెక్షన్లు 14, 24ల ప్రకారం వారికి ఇచ్చిన అధికారాలు ఇక్కడ కూడా వర్తిస్తాయి.

3) ఏదైనా రాష్ట్రంలో బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్‌ను ఏర్పాటుచేసి ఉండకపోతే పైన పేర్కొన్న సబ్ సెక్షన్ (1) లోని (ఎ) నుంచి (సి) క్లాజులలో పేర్కొన్న విధులను నిర్వర్తించటానికి సూచించిన నిబంధనలు, షరతులకు లోబడి సూచించిన విధంగా పనిచెయ్యటానికి ఒక అథారిటీని సంబంధిత ప్రభుత్వం ఏర్పాటుచేయవచ్చు.

### ఫిర్యాదుల పరిష్కారం

32. 1) సెక్షన్-31లో పేర్కొన్న దానితో సంబంధం లేకుండా ఈ చట్టం కింద బాలలకున్న హక్కుకి సంబంధించి ఏ వ్యక్తికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే సంబంధిత స్థానిక ప్రభుత్వానికి

లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చు.

2) సబ్ సెక్షన్ (1) కింద ఫిర్యాదు అందుకున్న తరువాత సంబంధిత పార్టీ వాదనలు వినడానికి న్యాయమైన అవకాశాలు కల్పించిన తరువాత సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి.

3) ఈవిషయంలో స్థానిక ప్రభుత్వ నిర్ణయంతో బాధకు గురైన ఏ వ్యక్తి అయినా సందర్భాన్ని బట్టి బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్‌కి గాని, లేదా సెక్షన్-31, సబ్ సెక్షన్ (3) కింద పేర్కొన్న అథారిటీకిగాని అప్పీలు చేసుకోవచ్చు.

4) సబ్ సెక్షన్ (3) కింద చేసిన ఇటువంటి అప్పీలుపై సందర్భాన్ని బట్టి బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్ గాని సెక్షన్ 31, సబ్ సెక్షన్ (3) కింద పేర్కొన్న అథారిటీ గాని సెక్షన్ 31, సబ్ సెక్షన్ (1), క్లాజు (ఎ) ప్రకారం నిర్ణయం చెప్పాలి.

## జాతీయ సలహా సంఘం ఏర్పాటు

33. 1) ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించినంత మందితో జాతీయ సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తుల నుంచి సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించాలి.

2) జాతీయ సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

3) జాతీయ సలహా సంఘం సభ్యుల నియామకపు షరతులు, నిబంధనలు, వారికి వర్తించే భత్యాలు సూచించిన దానికి అనుగుణంగా ఉండవచ్చు.

## రాష్ట్ర సలహా సంఘం ఏర్పాటు

34. 1) ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించినంత మందితో రాష్ట్ర సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తులను సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించాలి.

2) రాష్ట్ర సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థవంతంగా అమలుచేసే విధానాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

3) రాష్ట్ర సలహా సంఘం సభ్యుల నియామకం షరతులు, నిబంధనలు, వారికి వర్తించే భత్యాలు సూచించిన దానికి అనుగుణంగా ఉండవచ్చు.

# అధ్యాయం - VII

## వివిధ అంశాలు

### ఆదేశాలు జారీచేసే అధికారాలు

35. 1) ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటం కోసం తగిన సందర్భాన్ని బట్టి సంబంధిత ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ కేంద్ర ప్రభుత్వం జారీచేయవచ్చు.

2) ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటం కోసం తగిన సందర్భాన్ని బట్టి స్థానిక ప్రభుత్వానికి లేదా బడి యాజమాన్య సంఘానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ సంబంధిత ప్రభుత్వం జారీచెయ్యవచ్చు.

3) ఈ చట్టంలోని అంశాలను అమలుచెయ్యటం కోసం తగినట్లుగా బడి యాజమాన్య సంఘానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ స్థానిక ప్రభుత్వం జారీ చెయ్యవచ్చు.

### ప్రాసిక్యూషన్‌కి ముందస్తు అనుమతి

36. సెక్షన్ 13 సబ్ సెక్షన్ (2) కింద, సెక్షన్ 18, సబ్ సెక్షన్ (5) కింద, సెక్షన్ 19, సబ్ సెక్షన్ (5) కింద శిక్షార్హమైన నేరాలకు సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అధికారి ఆమోదం పొందిన తరువాతే ప్రాసిక్యూషన్ చేపట్టాలి.

### సదుద్దేశంతో చేపట్టిన చర్యలకు రక్షణ

37. ఈ చట్టం లేదా తదనుగుణంగా చేసిన నియమాలు, ఆదేశాల అమలులో సదుద్దేశంతో చేపట్టిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమీషన్, బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్, స్థానిక ప్రభుత్వం, బడి యాజమాన్య సంఘం, లేదా ఏ వ్యక్తిపైనా కూడా దావా లేదా చట్టపర ప్రొసీడింగ్ చేపట్టడానికి లేదు.

### నియమాలు రూపొందించటానికి సంబంధిత ప్రభుత్వ అధికారాలు

38. 1) ఈ చట్టంలోని, అంశాలను అమలు చెయ్యటానికి సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా

నియమాలు రూపొందించవచ్చు.

2) ఇంతకు ముందు పేర్కొన్న అధికారాలకు భంగం కలగకుండా ఈ కిందివాటికి నియమాలు రూపొందించాలి.

ఎ) సెక్షన్ 4లోని మొదటి అంశం ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధానం, దానికి నిర్ధారించిన గడువు;

బి) సెక్షన్ 6 కింద పరిసర ప్రాంత బడిని ఏర్పాటుచెయ్యటానికి నిర్దేశించిన గడువు;

సి) సెక్షన్ 9 కింద క్లాజు (ఈ) ప్రకారం పద్నాలుగు సంవత్సరాల వరకు బాలలకు సంబంధించి రికార్డులు నిర్వహించవలసిన విధానం.

డి) సెక్షన్ 12, సబ్ సెక్షన్ (2) కింద ఖర్చులో తిరిగి చెల్లించే మొత్తం, ఆ విధానం;

ఇ) సెక్షన్ 14, సబ్ సెక్షన్ (1) కింద బాలుడు/ బాలిక వయసును నిర్ధారించటానికి ఇతర పత్రం;

ఎఫ్) బడిలో ప్రవేశం ఇవ్వటానికి సెక్షన్ 15 కింద పెంచిన గడువు పరిధి, ఆ రకంగా ప్రవేశం పొందినప్పుడు చదువును పూర్తిచేసే విధానం;

జి) సెక్షన్ 18, సబ్ (1) ప్రకారం గుర్తింపు ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునే విధానం, పద్ధతి, అట్టి దరఖాస్తును తీసుకునే అథారిటీ;

హెచ్) సెక్షన్ 18, సబ్ సెక్షన్ (2) ప్రకారం గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే విధానం, పద్ధతి, షరతులు, కాలపరిమితి;

ఐ) సెక్షన్ 18, సబ్ సెక్షన్ (3) ప్రకారం తమ వాదనను వినిపించటానికి అవకాశమిచ్చే విధానం;

జె) సెక్షన్ 21, సబ్ సెక్షన్ (2), క్లాజు (డి) ప్రకారం బడి యాజమాన్య సంఘం నిర్వర్తించాల్సిన ఇతర విధులు;

కె) సెక్షన్ 22, సబ్ సెక్షన్ (3) ప్రకారం బడి అభివృద్ధి ప్రణాళిక తయారుచేసే విధానం;

ఎల్) సెక్షన్ 23, సబ్ సెక్షన్ (3) ప్రకారం టీచర్ల ఉద్యోగ నిబంధనలు, షరతులు, వారికి చెల్లించాల్సిన జీతభత్యాలు;

ఎం) సెక్షన్ 24, సబ్ సెక్షన్ (1), క్లాజు (ఎఫ్) ప్రకారం టీచర్లు నిర్వర్తించాల్సిన విధులు;

ఎన్) సెక్షన్ 24, సబ్ సెక్షన్ (3) ప్రకారం టీచర్ల ఫిర్యాదులను పరిష్కరించాల్సిన విధానం;

ఓ) సెక్షన్ 30, సబ్ సెక్షన్ (2) ప్రకారం ప్రాథమిక విద్యను పూర్తిచేసిన పిమ్మట ధృవీకరణపత్రాన్ని జారీచేసే విధానము, పద్ధతి;

పి) సెక్షన్ 31, సబ్ సెక్షన్ (2) ప్రకారం ఏర్పాటుచెయ్యవలసిన అథారిటీ అది ఏర్పడే విధానం, దాని షరతులు, నిబంధనలు;

క్యూ) సెక్షన్ 33, సబ్ సెక్షన్ (3) ప్రకారం జాతీయ సలహా సంఘ సభ్యుల నియామకం, వారి షరతులు, నిబంధనలు, వారికి చెల్లించాల్సిన భత్యాలు;

ఆర్) సెక్షన్ 34, సబ్ సెక్షన్ (3) ప్రకారం రాష్ట్ర సలహా సంఘం సభ్యుల నియామకం, షరతులు, నిబంధనలు వారికి చెల్లించాల్సిన భత్యాలు.

3) ఈ చట్టంలోని కేంద్రప్రభుత్వం చేసిన ప్రతి నియమాన్ని, సెక్షన్ 20, 23ల ప్రకారం జారీ చేసిన ప్రకటనలను అవి రూపొందించిన వెంటనే పార్లమెంటు ఉభయసభలు సమావేశంలో ఉన్నప్పుడు ప్రవేశపెట్టి 30 రోజులపాటు ఉంచాలి. ఇందుకు అవసరమైతే ఒక సమావేశంలో గానీ లేదా దాని తర్వాత వెంటనే జరిగే రెండు అంతకుమించి సమావేశాలలో గానీ ఉంచాలి. నియమాలు, ప్రకటనలలో మార్పులు చేసి ఆమోదించటానికి గానీ, లేదా అవి చెయ్యకూడదని గానీ ఉభయసభలు అంగీకరించిన తరువాత మాత్రమే అవి సందర్భాన్ని బట్టి మార్పులతో అమలులోకి వస్తాయి, లేదా అమలులలోకి రావు. అయితే ఈ చట్టం కింద అంతకుముందే చేసిన నియమాలు, ప్రకటనలకు ఇప్పటి నియమాలు, ప్రకటనలలో మార్పులు లేదా అసలు అమలుపరచకపోవటం అన్నవి అవరోధంగా ఉండవు.

4) ఈ చట్టం ప్రకారం రాష్ట్రప్రభుత్వం చేసే ప్రతి నియమాన్ని, ప్రకటననీ దానిని రూపొందించిన వెంటనే రాష్ట్ర సభల ముందు ఉంచాలి.

# షెడ్యూలు
## (చూడండి సెక్షన్లు 19, 25)

### బడికి నియమాలు, ప్రామాణికాలు

| క్ర.సం. | అంశం | నియమాలు, ప్రామాణికాలు | |
|---|---|---|---|
| 1 | టీచర్ల సంఖ్య | చేరుకున్న పిల్లల సంఖ్య | టీచర్ల సంఖ్య |
| | అ) 1 నుంచి 5వ తరగతి వరకు | 60 వరకు | - ఇద్దరు |
| | | 61 నుంచి 90 వరకు | - ముగ్గురు |
| | | 91 నుంచి 123 వరకు | - నలుగురు |
| | | 121 నుంచి 200 వరకు | - అయిదుగురు |
| | | 150 కి మించి | - 5 గురు + ఒక హెడ్‌మాస్టర్ |
| | | 200 కి మించి | - (ప్రధానోపాధ్యాయులు కాకుండా) విద్యార్థి - టీచర్ల నిష్పత్తి నలభైని మించకూడదు |
| | ఆ) 6 నుంచి | 1) ప్రతి తరగతికి ఒక టీచరు ఉండి, కింది అంశాలకు కూడా<br>ఎ) విజ్ఞానశాస్త్రం, లెక్కలు<br>బి) సామాజిక శాస్త్రం<br>సి) భాషలు | కనీసం ఒక టీచర్ ఉండాలి- 8వ తరగతి వరకు |
| | | 2) ప్రతి 35 మంది విద్యార్థులకు కనీసం 1 టీచరు, | |
| | | 3) చేర్చుకున్న పిల్లల సంఖ్య వందకు మించి ఉన్నట్లయితే- | |

| క్రసం. | అంశం | నియమాలు, ప్రామాణికాలు |
|---|---|---|
| | | ఎ) పూర్తికాల ప్రధానోపాధ్యాయులు<br>బి) కింది అంశాలకు పార్ట్‌టైమ్ బోధకులు–<br>అ) చిత్రకళ<br>ఆ) ఆరోగ్యం, వ్యాయామ విద్య<br>ఇ) వృత్తివిద్య |
| **2** | **భవనం** | అన్ని కాలాలకు అనువైన భవనంలో–<br>ఎ) ప్రతి టీచరుకు కనీసం ఒక తరగతి గది, కార్యాలయం, గోదాము, ప్రధానోపాధ్యాయుల గది.<br>బి) వికలాంగుల ప్రవేశానికి అనువుగా ఉండాలి<br>సి) ఆడపిల్లలకు, మగపిల్లలకు వేర్వేరుగా మరుగుదొడ్లు<br>డి) పిల్లలందరికీ సరిపోయేటంత రక్షిత మంచినీటి సౌకర్యం<br>ఇ) బడిలో మధ్యాహ్నపు భోజనం వండటానికి వంటగది<br>ఎఫ్) ఆటస్థలం<br>జి) సరిహద్దు గోడ లేదా కంచెతో బడి భవనానికి భద్రత ఏర్పాట్లు |
| **3** | **విద్యాసంవత్సరంలో కనీస పనిదినాలు/ బోధనా గంటల సంఖ్య** | ఎ) 1 నుంచి 5వ తరగతి వరకు 200 పనిదినాలు<br>బి) 6 నుంచి 8వ తరగతి వరకు 220 పనిదినాలు<br>సి) 1 నుంచి 5వ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో 800 బోధనా గంటలు<br>డి) 6 నుంచి 8వ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో వెయ్యి బోధనాగంటలు. |
| **4** | **టీచర్లకు వారానికి కనీస పనిగంటలు** | బోధనకి కనీసం 45, తయారీకి అదనపు గంటలు |

| క్రసం. | అంశం | నియమాలు, ప్రామాణికాలు |
|---|---|---|
| 5 | **బోధనా పరికరాలు** | ప్రతి తరగతికి అవసరం మేరకు అందజెయ్యాలి |
| 6 | **గ్రంథాలయం** | దినపత్రిక, పత్రికలు, అన్ని పాఠ్యవిషయాలపై పుస్తకాలు, కథల పుస్తకాలు అందించే గ్రంథాలయం ప్రతి బడిలో ఉండాలి. |
| 7 | **ఆటలు, క్రీడలకు సంబంధించిన సామగ్రి** | ప్రతి తరగతికి అవసరం మేరకు అందజెయ్యాలి. |

# బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం నిబంధనలు : ఆంధ్రప్రదేశ్ - 2010

విద్య మా హక్కు

సర్వ శిక్షా అభియాన్

అందరూ చదవాలి-అందరూ ఎదగాలి

# బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం నిబంధనలు : ఆంధ్రప్రదేశ్ - 2010

### 1. క్లుప్తంగా పేరు

ఈ నిబంధనలను బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం నిబంధనలు – ఆంధ్రప్రదేశ్, 2010 అని పిలుస్తారు.

### 2. అమలు

ఈ నిబంధనలు 01–04–2010 నుండి అమలులోకి వచ్చాయి.

### 3. నిర్వచనాలు

**ఈ నిబంధనలలో వాడిన పదాలు వాటి నిర్వచనాలు :**

1) 'చట్టం' అంటే బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009.

2) అంగన్‌వాడీ అంటే సమగ్ర శిశుఅభివృద్ధి పథకం కింద భారత ప్రభుత్వం వారి స్త్రీ శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం.

3) బాలలు అంటే 6–14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలందరు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు 5 సంవత్సరాలు వయస్సు పూర్తిచేసుకున్న బాలబాలికలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

4) సామాజికంగా ప్రతికూల పరిస్థితులలో ఉన్న సమూహాలకు చెందిన బాలలు అంటే షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగల బాలలు, అనాథ బాలలు, వీధి బాలలు, వలస వచ్చిన బాలలు, ప్రత్యేక అవసరాలు కల బాలలు, హెచ్.ఐ.వి. బారిన పడిన బాలలు, హెచ్.ఐ.వి. బాధిత బాలలు.

5) బలహీన వర్గాలకు చెందిన బాలలు అంటే బి.సి., మైనారిటీలు, ఇతర కులాలకు చెంది, వార్షిక ఆదాయం 60,000 రూపాయలకు మించని తల్లిదండ్రుల పిల్లలు.

6) 'కలెక్టర్' అంటే జిల్లాలో పౌర, రెవెన్యూ పాలనాధికారి.

7) ‘కార్పోరేటర్లు’ అంటే గ్రేటర్ హైదరాబాద్, మున్సిపల్ కార్పోరేషన్ లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉన్న మున్సిపల్ కార్పోరేషన్లలోని వార్డులకు ఎన్నుకోబడిన సభ్యులు.

8) ‘కౌన్సిలర్’ అంటే నగర స్థానిక సంస్థలోని వార్డుకు ఎన్నుకోబడిన సభ్యులు.

9) ‘జిల్లా’ అంటే రాష్ట్రంలోని రెవెన్యూ జిల్లా.

10) ‘జిల్లా విద్యాశాఖాధికారి’ అంటే జిల్లా స్థాయిలో ఎలిమెంటరీ విద్యకు సంబంధించిన కార్యక్రమాలను అమలుచేసే బాధ్యత గల అధికారి.

11) ‘ఇ.సి.ఇ.’ అంటే ప్రాథమిక పాఠశాలల ఖాళీ స్థలంలో లేదా ఇతర స్థలాలలో 3-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పూర్వ పాఠశాల విద్యను అందించడానికి సర్వశిక్షాఅభియాన్ నెలకొల్పిన బాల్యారంభ సంరక్షణ కేంద్రాలు (Early Childhoood Care Centres).

12) ‘ఎలిమెంటరీ పాఠశాల’ అంటే ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యనందించే పాఠశాల. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ తరగతులు ఉన్న అన్ని పాఠశాలలు అంటే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈ కోవలోకి వస్తాయి.

13) ‘ఉచిత విద్య’ అంటే పిల్లలందరికీ తల్లిదండ్రుల నుండి ఎలాంటి ప్రత్యక్ష ఖర్చు అంటే ఫీజులు/ క్యాపిటేషన్ ఫీజులు, లేదా పరోక్ష ఖర్చులు అంటే సేవలు/ స్టేషనరీ/ వస్తు రూపేణా వసూలు చేసే ఫీజులు మొదలగునవి లేకుండా ఎలిమెంటరీ విద్యను అందించడం. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమీప ప్రాంత పాఠశాలలోని పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు (సబ్జెక్టుకు ఒక నోటుబుక్కు చొప్పున), ఇతర లేఖన సామగ్రి, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, యూనిఫాంలను సమకూర్చడం.

14) ‘గ్రామ పంచాయతీ’ అంటే ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 ప్రకారం ఏర్పాటుచేయబడినది.

15) ‘స్థానిక సంస్థలు’ అంటే చట్టప్రకారం సంబంధిత పరిధులలో ఉన్న మండల పరిషత్తు/ జిల్లా పరిషత్తు/ మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పోరేషన్ సంస్థలు.

16) ‘మండల విద్యాశాఖధికారి’ అంటే – మండలస్థాయిలో ఎలిమెంటరీ విద్యకు సంబంధించిన కార్యక్రమాలను అమలుచేసే బాధ్యత గల అధికారి.

17) 'మండల రిసోర్స్ పర్సన్' (యం.ఆర్.పి.) అంటే ఒక క్లస్టర్‌లోని పాఠశాలల విద్యావిషయక కార్యకలాపాలను సమన్వయపరిచే రిసోర్స్ టీచర్.

18) 'ఒక పాఠశాల సమీపప్రాంత పరిధి' అంటే ప్రాథమిక పాఠశాల నుండి 1 కి.మీ. (సురక్షితంగా నడవగలిగే వీలున్నది) దూరం, ప్రాథమికోన్నత పాఠశాల/ ఉన్నత పాఠశాల (6 నుండి 8 తరగతులు ఉన్న) నుండి 3 కి.మీ. దూరంలో ఉన్న ఆవాస ప్రాంతాలు.

19) 'బడి బయటి పిల్లలు' అంటే ఎలిమెంటరీ చదువు పూర్తి చేయనివారు (పాఠశాలలో నమోదు కానివారు లేదా ఎలిమెంటరీ విద్య పూర్తి కాకుండా పాఠశాల మానివేసినవారు). ఎలిమెంటరీ పాఠశాలలో చేరి ఒకనెల కంటే ఎక్కువ రోజులు అనుపస్థితి అయిన పిల్లలు కూడా బడి బయటి పిల్లలే.

20) 'ప్రాథమిక పాఠశాల' అంటే ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు విద్యను అందించే పాఠశాల.

21) 'సర్పంచ్' అంటే గ్రామ పంచాయితీకి ఎన్నుకోబడిన అధినేత.

22) 'స్కూల్ మ్యాపింగ్' అంటే భౌగోళిక దూరం, సామాజిక అడ్డంకులను అధిగమించడానికి పాఠశాల ఉన్నచోటు తెలిపే వివరణాత్మక నమూనా. ఇందులో ఒక ఆవాస స్థలం నుండి ఇతర ఆవాస స్థలాల మధ్య దూర మాత్రిక పద్ధతినుపయోగించి పాఠశాల ఉన్నచోటు, భౌతిక వసతి సౌకర్యాలు, ఉపాధ్యాయులు వంటి అంశాలతో నిర్దేశిత నిబంధనలు, ప్రమాణాల ఆధారంగా ఎలిమెంటరీ విద్యాసౌకర్యాల అందుబాటును అంచనావేస్తారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్) అన్ని పాఠశాలల మ్యాపింగ్ కోసం రూపొందించిన భౌగోళిక సమాచార వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

23) 'రాష్ట్రం' అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

24) 'రాష్ట్ర ప్రభుత్వం' అంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

25) పాఠశాలలకు సంబంధించి నిర్ధారిత కేటగిరి అంటే చట్టంలోని 2వ సెక్షన్ క్లాజ్ (n) లో, సబ్ క్లాజ్ (iii) ఉద్దేశాల మేరకు నెలకొల్పిన సైనిక పాఠశాలలు, నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలతో పాటు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (KGBVs),

ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ (APTWREIS) నిర్వహిస్తున్న పాఠశాలలు, సమీకృత గిరిజనాభివృద్ధి ఏజెన్సీలు (ITDAs) నిర్వహిస్తున్న పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (SAAP) నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలు.

26) చట్టంలో పేర్కొన్న 'అకడమిక్ అథారిటీ' అంటే రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా మండలి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్.

27) 'చట్టాన్ని అమలుచేసే అథారిటీ' అంటే కమీషనర్ & డైరెక్టర్, పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్‌తో పాటు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, సర్వశిక్షా అభియాన్.

28) 'నడవగలిగే దూరం' అంటే ఆవాస ప్రాంతం నుండి పాఠశాలకు పిల్లలు నడిచే దూరం.

29) వార్డు సభ్యులు అంటే గ్రామపంచాయితీలోని వార్డులకు ఎన్నుకోబడిన సభ్యులు.

## 4. బడి బయటి పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ

1) పాఠశాల యాజమాన్య కమిటీ/ స్థానిక అథారిటీ ప్రత్యేక శిక్షణ అవసరమైన పిల్లలను గుర్తించాలి. వారికి శిక్షణను కిందివిధంగా నిర్వహించాలి.

   అ) చట్టంలో సెక్షన్ 29(1)లో పేర్కొన్న అకడమిక్ అథారిటీ ఆమోదించిన విధంగా ప్రత్యేకంగా రూపొందించిన, వయస్సుకు తగిన అభ్యసన సామగ్రి ఆధారంగా ప్రత్యేక శిక్షణ ఉండాలి.

   ఆ) సురక్షిత నివాస సౌకర్యాలతో కూడిన గదులలో లేదా పాఠశాల ప్రాంతంలో ఏర్పరచిన తరగతి గదులలో శిక్షణ నిర్వహించాలి.

   ఇ) పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు లేదా ప్రత్యేకంగా ఈ శిక్షణ కొరకే ఉద్దేశించబడిన ఉపాధ్యాయులతో శిక్షణనిప్పించాలి.

   ఈ) శిక్షణ కాలవ్యవధి కనీసం '3' నెలలుండాలి. కాని అభ్యసన ప్రగతి పీరియాడిక్ అసెస్‌మెంట్ ఆధారంగా ఈ వ్యవధిని గరిష్ఠంగా 2 సంవత్సరాలు దాటకుండా పొడిగించవచ్చు.

2) ప్రత్యేక శిక్షణ తర్వాత పిల్లలను వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చాలి. వీరిపట్ల విద్యావిషయకంగా, ఉద్వేగపరంగా తరగతిలో మిగతా పిల్లలతో చక్కగా కలిసిపోవడానికి టీచరు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

3) బడి బయటి పిల్లలను గుర్తించడం, సమీకరించడంలో స్వయం సహాయక బృందాలు, పౌర సమాజ సంస్థలు మొదలైనవి చురుకుగా పాల్గొనేలా పాఠశాల యాజమాన్య కమిటీ చూడాలి.

## 5. చట్టం ప్రకారం విద్యా వసతుల అందుబాటు

1) దిగువ తెలిపిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం సమీప ప్రాంత పాఠశాలలను నెలకొల్పాలి.

   అ) 1 నుండి 5 తరగతుల బాలలకు వారి పరిసర ప్రాంతానికి 1 కి.మీ. నడవగలిగే దూరంలోపు పాఠశాలను ఏర్పాటుచేయాలి.

   ఆ) 6 నుండి 8 తరగతుల బాలలకు తమ పరిసర ప్రాంతానికి 3 కి.మీ. నడవగలిగే దూరంలోపు పాఠశాలను ఏర్పాటుచేయాలి.

2) 1 నుండి 5 తరగతులు ఉన్న ప్రస్తుత ప్రాథమిక పాఠశాలల స్థాయిని 6 నుండి 8 తరగతుల వరకు పెంచాలి. అలాగే 1 నుండి 7 తరగతులున్న ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిని 8వ తరగతి వరకు పెంచాలి.

3) క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, వరదలు వచ్చే, కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలు, రోడ్డు వసతి లేకుండా ఇంటినుండి బడికి వెళ్ళే చిన్న పిల్లలకు ప్రమాదంగా ఉండే ప్రాంతాలలో సమస్యలను అధిగమించే రీతిలో సబ్ రూల్ (1) కింద పేర్కొన్న పరిమితులను కుదించి అయినా ప్రభుత్వం/ స్థానిక అథారిటీ పాఠశాల నిర్వహణకు అనువైన స్థలాన్ని కనుగొనాలి.

4) రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం గుర్తించిన కుగ్రామాలకు చెందిన బాలలకు పైన తెలిపిన సబ్ రూల్ (1) ప్రకారం పరిసర ప్రాంతాలలో పాఠశాల అందుబాటులో లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం, నివాస సౌకర్యం, ఇతర సౌకర్యాలు కల్పించి మాధ్యమిక విద్యనందించాలి.

5) ఎక్కువ జనసాంద్రత గల ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం అవసరాన్ని, పిల్లల సంఖ్యను బట్టి సమీప ప్రాంత పాఠశాలలో ఎక్కువ సెక్షన్లు లేదా ఒకటి కంటే ఎక్కువ సమీప ప్రాంత పాఠశాలలను ప్రారంభించాలి.

6) స్థానిక ప్రభుత్వం బాలలను చేర్పించడానికి సమీప ప్రాంత పాఠశాలలను గుర్తించి తన పరిధిలోని అన్ని ఆవాస ప్రాంతాలలో ఆ సమాచారాన్ని బహిరంగపరచాలి.

7) వైకల్యం వల్ల అందుబాటులో ఉన్న పాఠశాలలకు హాజరుకాలేని బాలల విషయంలో ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం సురక్షిత రవాణా ఏర్పాట్లను కల్పించడం లేదా అర్హత గల తల్లిదండ్రులు/ సంరక్షకులుకు ప్రత్యామ్నాయ ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడం ద్వారా అటువంటి బాలలు పాఠశాలలకు హాజరై మాధ్యమిక విద్యను పూర్తి చేయటానికి తగిన కృషి చేయాలి. తీవ్ర/ అతితీవ్ర వైకల్యంతో బాధపడే బాలలకోసం సమీప ప్రాంత పాఠశాలలకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ అది సురక్షితం కాని బాలల విషయంలో వారికి ఇంటివద్దనే విద్యను (Home Based Education) అందించడానికి ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలి.

8) సామాజిక/ సాంస్కృతిక కారణాల వల్ల పిల్లలు పాఠశాలలకు హాజరు కాలేని పరిస్థితి కలగకుండా ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం చూడాలి. పిల్లలందరూ సమీప ప్రాంత పాఠశాలలో చేరడానికి వీలుగా భవిష్యత్తులో సామాజికంగా ప్రతికూల బృందాలకు చెందినవారి ఆవాస ప్రాంతాలలో ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పడాన్ని ప్రోత్సహించకూడదు. అయితే ప్రత్యేక విద్య అవసరం ఉన్న బలహీన వర్గాలకు చెందిన బాలలు, వైకల్యంతో బాధపడుతున్న బాలలను కలుపుకుని సామాజిక ప్రతికూల వర్గాలకు చెందిన బాలల కోసం ప్రభుత్వం ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పవచ్చు.

9) పౌర ఆందోళనల ప్రభావిత ప్రాంతాలు, క్లిష్ట పరిస్థితులలో ఉన్న బాలల కోసం ప్రభుత్వం ఎటువంటి అంతరాయం లేకుండా చదువు కొనసాగించే సురక్షిత ప్రాంతాలుగా పాఠశాలలను ప్రకటించాలి. చదువుకు అంతరాయం ఏర్పడిన సందర్భంలో చదువు సురక్షితంగా తిరిగి కొనసాగించడానికి వీలుగా బాలలందరినీ రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్చాలి.

## 6. రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం విధులు

1) చట్టం– సెక్షన్ 2లోని క్లాజ్ (ఎన్) కి చెందిన సబ్ క్లాజ్ (1) లో తెలిపినట్లు ప్రభుత్వ లేదా స్థానిక ప్రభుత్వ పాఠశాలకు హాజరవుతున్న బాలలు, చట్టం–సెక్షన్ 2లోని క్లాజ్ (ఎన్)కి చెందిన సబ్ క్లాజ్ (2)లో పేర్కొన్న విధంగా పాఠశాలకు హాజరవుతున్న బాలలు, చట్టం–సెక్షన్ 12 సబ్ సెక్షన్ (1) కి చెందిన క్లాజ్ (బి) ననుసరించి సబ్ క్లాజ్ (3)లో పేర్కొన్న పాఠశాలలు (APREIS, APSWREIS నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ విద్యాసొసైటీలు నిర్వహిస్తున్న ఇతర పాఠశాలలు), ఇతర ప్రభుత్వ శాఖలు

నిర్వహిస్తున్న పాఠశాలలలో చట్టం–సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) కి చెందిన సబ్ క్లాజ్ (4) నిర్వహించిన పాఠశాలల్లో చేరిన బాలలు, చట్టం– సెక్షన్ 12లో సబ్ సెక్షన్ (1) లోని క్లాజ్ (సి) ననుసరించి భారత ప్రభుత్వం/ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొన్న విధంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, లేఖన సామగ్రి పొందడానికి అర్హులు.

ఇంకా–

- రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పుస్తకాలు, యూనిఫాంలు, పరికరాలు, ప్రత్యేక సామగ్రి, ఆటంకరహిత పరిసరాలతో కూడిన ఉచిత విద్యను పొందడానికి వైకల్యం కలిగిన బాలలు అర్హులు.
- ప్రత్యే అవసరాలు గల బాలలకు అందరితో విద్య ఉద్దేశం నెరవేరడానికి అనువైన బోధనాపద్ధతులలో రెగ్యులర్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లందరికీ శిక్షణ నివ్వాలి.

వివరణ–

1) చట్టంలోని సెక్షన్ 12లో సబ్ సెక్షన్–1, క్లాజ్ (బి) & (సి) లలో పేర్కొన్న విధంగా అడ్మిషన్ పొందిన పిల్లలకు ఉచితంగా సమకూర్చాల్సిన బాధ్యత చట్టంలోని సెక్షన్–2లో క్లాజ్ (ఎన్)లో సబ్ క్లాజ్ ii, iii & iv ల ప్రకారం సంబంధిత పాఠశాలల స్వీకరించాలి.

2) చట్టంలోని సెక్షన్–4లో ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం స్కూల్ మ్యాపింగ్ ద్వారా దూరప్రాంతాల పిల్లలు, వైకల్యం గల పిల్లలు, ప్రతికూల బృందాలకు చెందిన పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఇలా పిల్లలందరినీ గుర్తించి (చట్టంలోని సెక్షన్–4లో పేర్కొన్న విధంగా) వారికోసం సమీప ప్రాంత పాఠశాలలను నెలకొల్పాలి. ఇది చట్టప్రకారం ఒక సంవత్సరం లోపు జరగాలి. అలాగే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 30కి వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

3) కులం, వర్గం, మతం లేదా లింగం కారణంగా వివక్షతలకు ఏ బాలుడు/ బాలిక కూడా గురికాకుండా అలాగే ఏ ఒక్కరికి కులం/ వర్గం/ మతం/ లింగం కారణంగా అడ్మిషన్‌ను ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాల కూడా తిరస్కరించకుండా ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం నిర్ధారించాలి.

4) చట్టంలోని సెక్షన్–9, (సి) క్లాజ్ & సెక్షన్–8లోని (సి) క్లాజ్ ఉద్దేశాలు నెరవేర్చటానికి

తరగతి గదిలో, మధ్యాహ్న భోజన సమయంలో, ఆటస్థలంలో, తాగునీరు, మరుగుదొడ్లను ఉపయోగించే సందర్భంలో తరగతి గదులు, మరుగుదొడ్లను శుభ్రపరచడంలో ప్రతికూలవర్గాలు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలను వేరుపరచడం, వేరుగా చూడడం వంటివి తలెత్తకుండా ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం నిర్ధారించాలి.

5) మానవహక్కులలో ఆర్టికల్ 24లో నిర్దేశించిన విధంగా వైకల్యంతో బాధపడేవారికి చదువుకునే హక్కును కల్పించడం కోసం తగు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం టీచర్లను (వైకల్యం ఉన్న టీచర్లతో సహా) సంకేత భాష లేక బ్రెయిలీ యోగ్యతను కలిగి ఉన్న వారిని నియమించడం, అన్ని విద్యాస్థాయిలలో పనిచేసే సిబ్బందికి, వృత్తినిపుణులకు శిక్షణ నివ్వడం వంటి చర్యలు చేపట్టాలి. విద్యావిషయక మెళకువలు, వైకల్యంతో బాధపడే వ్యక్తులకు సాయమందించే సామగ్రి, కమ్యూనికేషన్ రూపాలు, సాధనాలను వృద్ధిపరిచే ప్రత్యామ్నాయ విధానాలను ఉపయోగించడం, వైకల్యంపై అవగాహనను కల్పించడం వంటి అంశాలను శిక్షణలో చేర్చాలి.

6) వైకల్యం గల పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ప్రత్యేక పాఠశాలలలో వైకల్యాలలో విశిష్టీకరణతో కూడిన ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలను వృద్ధిపరచడంలో, సుశిక్షితులైన మానవ వనరులను అందుబాటులో ఉంచడంలో జాతీయ సంస్థలు, ఇతర ఆర్గనైజేషన్లకు సాయం చేయడానికి తగినన్ని ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పాలి.

7) ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే వృత్యంతర ఉపాధ్యాయులకు శిక్షణను ఇవ్వాలి.

8) ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తోడుగా నిలిచే విధంగా వారి తల్లిదండ్రులకు శిక్షణను ఇవ్వాలి.

9) ప్రత్యేక అవసరాలు గల పిల్లల గురించి పాఠశాల యాజమాన్య కమిటీలకు, ఇతర పౌర సమాజ సంస్థలకు శిక్షణనివ్వాలి.

## 7. స్థానిక అథారిటీ నిర్వహించాల్సిన పిల్లల రికార్డులు

1) పుట్టినప్పటి నుండి 14 ఏళ్ళ వయస్సు వచ్చేవరకు పిల్లలందరి రికార్డును ఇంటింటి సర్వే ద్వారా స్థానిక అథారిటీ తన పరిధిలో నిర్వహించాలి. పై తరగతికి వెళ్ళేవారి వివరాలు, అభ్యసన సాధన, హాజరు, నమోదు, పర్యవేక్షణ కోసం ప్రతి ఒక్కరికి ఒక ప్రత్యేక

సంఖ్యను కేటాయించాలి. వలస పిల్లలలో ప్రతి ఒక్కరికి ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించాలి. వలస పిల్లలలో ప్రతి ఒక్కరికి ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించాలి. వలస ప్రాంతాలు, పనిచేసే స్థలాలు, రిజిస్టర్ చేయబడని ఆవాస ప్రాంతాలు మొదలైన వాటిల్లో పిల్లలను గుర్తించడానికి కూడా ఇంటింటి సర్వేను చేపట్టాలి.

2) సబ్ రూల్ (1) ప్రకారం పై రికార్డును ప్రతి సంవత్సరం అప్‌డేట్ చేయాలి.

3) సెక్షన్ 9లోఎ క్లాజ్ (ఇ)లో పేర్కొన్న ఉద్దేశాల కోసం ప్రజల సమక్షంలో సబ్‌రూల్ 1 లో పేర్కొన్న విధంగా పై రికార్డును పారదర్శకతతో నిర్వహించాలి.

4) సబ్‌రూల్ 1లో పేర్కొన్న పై రికార్డులో ప్రతి బాలుడు/ బాలికకు సంబంధించి దిగువ తెల్పిన వివరాలు ఉండాలి.

అ) పేరు, లింగం, పుట్టిన తేది (జనన ధృవీకరణ పత్రం సంఖ్య), జన్మస్థలం

ఆ) తల్లిదండ్రులు/ సంరక్షకుల పేర్లు, చిరునామా, వృత్తి

ఇ) ఆరు సంవత్సరాల వరకు హాజరైన లేదా హాజరవుతున్న పూర్వ ప్రాథమిక పాఠశాల/ అంగన్‌వాడీ కేంద్రం

ఈ) చేరిన పాఠశాల చిరునామా

ఉ) ప్రస్తుత చిరునామా

ఊ) చదువుతున్న తరగతి (6–14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు), ఒకవేళ స్థానిక అథారిటీ ప్రాదేశిక పరిధిలో విద్యను కొనసాగించకపోతే ఆ వివరాలు, అందుకు గల కారణాలు.

ఎ) బలహీనవర్గాలకు చెందితే ఆ వివరాలు.

ఏ) ప్రతికూల సమూహాలకు చెందితే ఆ వివరాలు.

ఐ) వలస, జనసాంద్రత తక్కువ, అడ్మిషన్‌కు తగిన వయస్సు, వైకల్యం కారణంగా పిల్లలకు ఏవైనా ప్రత్యేక సౌకర్యాలు/ఆవాస సౌకర్యాలు అవసరమైతే వారి వివరాలు.

5) పాఠశాలలో నమోదైన పిల్లలందరి పేర్లను స్థానిక అథారిటీ తన పరిధిలోని ప్రతి పాఠశాలలో బహిరంగంగా ప్రదర్శించేటట్లు నిర్ధారణ చేసుకోవాలి.

6) పాఠశాలల్లో కేవలం పిల్లల విద్యావిషయక ప్రగతినే కాకుండా వారి నిలకడ, స్థాయిల వారీగా ఆశించిన మార్పులు సాధించడం, వలసలను అరికట్టడం వంటి అంశాలను పర్యవేక్షించడానికి చైల్డ్ ట్రాకింగ్ విధానాన్ని అవలంబించాలి. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్ ), కమీషనర్ & డైరెక్టర్, పాఠశాల విద్య గారలతో సంప్రదింపులు జరపాలి.

7) ఆంధ్రప్రదేశ్‌లో ఒక జిల్లా నుండి మరో జిల్లాకు, ఆంధ్రప్రదేశ్ నుండి మరో రాష్ట్రానికి అలాగే ఇతర రాష్ట్రాల నుండి ఆంధ్రప్రదేశ్‌కు కుటుంబాలు వలస పోతుంటాయి. ఈ కుటుంబాల పిల్లల జాడ కనుక్కొని వారి మాధ్యమిక విద్యకు ఆటంకం కలగకుండా కొనసాగించేందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం చేయాలి.

8) కూలీ కోసం వలస వెళ్ళే తల్లిదండ్రులున్న గ్రామాలలో వారి పిల్లలకోసం సీజన్ ఆధారంగా సీజనల్ హాస్టళ్ళు లేదా దీర్ఘకాలిక హాస్టళ్ళను ప్రభుత్వం నడపాలి. అప్పుడు తల్లిదండ్రులు ఇతర ప్రదేశాలకు వలస వెళ్ళినప్పటికీ వారి పిల్లలు హాస్టళ్ళలో ఉండి చదువుకునే వీలు ఏర్పడుతుంది.

9) సమూహాలుగా ఉపాధి పనుల కోసం ఇతర రాష్ట్రాలనుండి వచ్చే కూలీల పిల్లల చదువు కోసం ప్రభుత్వం పనిచేసే స్థలాలలోనే పాఠశాలలను ఏర్పాటుచేయాలి. వారికి వారి మాతృభాషలో విద్యనందించాలి. వలస వచ్చే కుటుంబాలకు చెందిన రాష్ట్రాలను సంప్రదించి వారి మాతృభాష పాఠ్యపుస్తకాలను, బోధనాసామగ్రిని పిల్లలకు అందించాలి.

## 8. బలహీన వర్గాలు, ప్రతికూల సమూహాలకు చెందిన పిల్లల అడ్మిషన్

1) చట్టంలోని సెక్షన్–12లోని సబ్ సెక్షన్ (1) లో క్లాజ్ (సి) ప్రకారం పిల్లలను చేర్చుకున్న పాఠశాల ఎటువంటి పరిస్థితిలోను చట్టంలోని సెక్షన్–2 లోని క్లాజు (ఎన్) లో సబ్ క్లాజ్ (iii) & (iv) లలో పేర్కొన్న విధంగా పిల్లలను తరగతి గదుల్లో ఇతర పిల్లల నుండి వేరుచేయడం, వేరుగా చూడడం కాని చేయకూడదు. అలాగే ఇతర పిల్లలకు కేటాయించిన సమయం, స్థలం కాకుండా వేరే సమయం, స్థలం కేటాయించడం చేయకుండా నిర్ధారించాలి.

2) చట్టంలోని సెక్షన్–12లోని సబ్ సెక్షన్ (1) లో క్లాజ్ (సి) ప్రకారం పిల్లలను చేర్చుకున్న పాఠశాల ఎటువంటి పరిస్థితిలోను చట్టంలోని సెక్షన్–2 లోని క్లాజు (ఎన్) లో సబ్

క్లాజ్ (iii) & (iv) లలో పేర్కొన్న విధంగా వారిని పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, గ్రంథాలయం, ఇన్ఫర్మేషన్ & కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) సౌకర్యాలు, పాఠ్యేతర కార్యకలాపాలు, క్రీడలు వంటి వాటి విషయంలో ఏ విధంగానైనా ఇతర పిల్లల నుండి వేరుగా చూడకూడదు.

## 9. నివాస స్థలం - ఋజువు

1) బాలుడు లేదా బాలిక సంబంధిత సమీప ప్రాంతానికి చెందినట్లు నిర్ధారించటానికి ఋజువుగా దిగువ తెలిపిన పత్రాలలో ఏదైనా ఒకదానిని తీసుకోవచ్చు.

   అ) రేషన్ కార్డు

   ఆ) పట్టాదారు పాస్ పుస్తకం

   ఇ) కరెంటు బిల్లు

   ఈ) ఇంటిపన్ను రశీదు లేదా గ్రామపంచాయితీ/ మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పోరేషన్ నిర్వహించే ఇంటిపన్ను రిజిష్టర్‌లో పేర్కొన్న భాగం.

   ఉ) ఒకవేళ టెలిఫోన్ ఉంటే దాని బిల్లు లేదా ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిర్దిష్టంగా పేర్కొన్న ఏ ఇతర పత్రాన్నైనా రుజువుగా స్వీకరించవచ్చు.

2) రూల్ 5 లోని సబ్ రూల్ (1) లో నిర్ధారించిన సమీప ప్రాంత పరిధులు, ప్రాంతాలు చట్టంలోని సెక్షన్–12, సబ్ సెక్షన్ (1) లోని క్లాజ్ (సి) ప్రకారం తీసుకున్న అడ్మిషన్లకు వర్తిస్తాయి. ఒకవేళ సందర్భాన్ని అనుసరించి ఆవశ్యకమైన సీట్ల శాతం మేరకు పిల్లల అడ్మిషన్లు పూరించలేకపోయినట్లైతే ఏరియా లేదా పరిధిని 3 కిలోమీటర్లకు పెంచవచ్చు. ఇందుకోసం విధిగా జిల్లా విద్యాశాఖాధికారి నుండి సంబంధిత పాఠశాల పూర్వానుమతి పొందాల్సి ఉంటుంది. అంతేకాకుండా స్థానిక ఏరియా లేదా పరిధి పెంచే ముందు మండల విద్యాశాఖాధికారి ప్రభుత్వ పాఠశాలలో సీట్లన్నీ పూరించబడేలా నిర్ధారించుకోవాలి.

3) పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ తన పరిధిలోని ప్రత్యేక పాఠశాలలు, ప్రతి ప్రైవేట్ పాఠశాలల వివరాలతో పాటు సమీప ప్రాంతంలో ఉన్న బలహీనవర్గాలు, ప్రతికూల బృందాలకు చెందిన పిల్లల జాబితాను నిర్వహించాలి.

4) చట్టంలో పేర్కొన్న సెక్షన్ 12లోని సబ్ సెక్షన్ (1) కి చెందిన బి, సి క్లాజులలో చెప్పిన

విధంగా పిల్లలను చేర్చుకోవడంలో చట్టంలోని 2వ సెక్షన్ – క్లాజు (ఎన్) లో ii, iii & iv సబ్ క్లాజులలో పొందుపరిచిన పాఠశాలలో దిగువ తెలిపిన ప్రాధాన్యతా క్రమాన్ని పాటించాలి.

అ) ప్రతికూల వర్గాలు

| | | |
|---|---|---|
| అనాథలు, హెచ్.ఐ.వి. సోకిన పిల్లలు, వైకల్యం కలిగి ఉన్న పిల్లలు | | 5% |
| షెడ్యూల్డు కులాలు | | 10% |
| అ | షెడ్యూల్డు తెగలు | 4% |
| ఆ | ఇతరులను కలుపుకొని బలహీన వర్గాలు (ఉదా : బి.సి., మైనార్టీలు, ఇతర కులాలు) వార్షిక ఆదాయం రూ. 60,000/- మించనివారు | 6% |
| | మొత్తం | 25% |

## గమనిక :

1. పైన తెల్పిన రిజర్వేషన్ల క్రమం మైదాన ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు కూడా వర్తిస్తాయి. ఎక్కడైనా అనాథ బాలలు, హెచ్.ఐ.వి. సోకిన బాలలు, వైకల్యం ఉన్న బాలలు లేకపోతే ఆ ఖాళీలు లేదా మిగిలిన ఖాళీలు కొద్ది సంఖ్యలోనే ఉన్నా వాటిని ఎస్.టి., ఎస్.సి. బాలలకు కేటాయించాలి. అనాథలు, హెచ్.ఐ.వి. సోకినవారు, వైకల్యం ఉన్నవారు, ఎస్.సి., ఎస్.టి. బాలల అడ్మిషన్లు అయిన తర్వాత ఏమైనా సీట్లు మిగిలిపోతే వాటిని బలహీనవర్గాల శాతానికి కలపాలి.

2. గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజన బాలలందరినీ చేర్చుకోవాలి. గిరిజన బాలలందరు చేరినా ఇంకా సీట్లు మిగిలిఉంటే వాటిని షెడ్యూల్డ్ కులాల వారికి కేటాయించాలి. అయినా ఇంకా ఒకవేళ సీట్లు మిగిలి ఉంటే ఇతరులకు కేటాయించాలి.

3. అల్పసంఖ్యాక వర్గ సంస్థలలో మైనార్టీకి చెందిన పిల్లలందరినీ మొదట చేర్చుకోవాలి. ఆ తర్వాత సీట్లేమైనా మిగిలితే వాటిని ఎస్.టి., ఎస్.సి., బి.సి., అనాథలు, వైకల్యం ఉన్నవారికి క్రమంగా కేటాయించాలి.

## 10. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఒక్కొక్క విద్యార్థికి అయిన ఖర్చు తిరిగి చెల్లించటం

1) రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం ద్వారా నెలకొల్పబడి లేదా నియంత్రణలో ఉన్న

అన్ని పాఠశాలల మొత్తం వార్షిక రికరింగ్ ఖర్చును అటువంటి పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్యతో భాగించగా వచ్చిన మొత్తం ఒక్కొక్క పిల్లవాడి ఖర్చుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం తమ స్వంత నిధులు లేదా కేంద్ర ప్రభుత్వం నుండి పొందిన నిధుల నుండి ఖర్చు చేయాలి.

**వివరణ :** ఒక్కొక్క విద్యార్థి ఖర్చును నిర్ధారించడానికి, సెక్షన్ (2) (ఎన్) క్లాజులోని సబ్ క్లాజ్ (ii)లోని పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం చేసిన ఖర్చు లెక్కించబడదు.

2) సెక్షన్ 2 క్లాజ్ (ఎన్)లోని సబ్ క్లాజ్ (iv) లో పేర్కొన్న ప్రతి పాఠశాల సెక్షన్ 12 సబ్ సెక్షన్ (2) ప్రకారం రీయంబర్స్‌మెంట్ పొందే మొత్తం కోసం ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాలి.

3) చట్టంలోని సెక్షన్–12లో సబ్ సెక్షన్ (2) కింద ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం పాఠశాలకు రీయంబర్స్‌మెంట్ చేయటానికి ఒకొక్క విద్యార్థిపై చేసే ఖర్చును మదింపు చేసేందుకు రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీలో ఫైనాన్స్ సెక్రటరీ, ప్రాథమిక విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి/ కార్యదర్శి కమీషనర్ & డైరెక్టర్, పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ ప్రతిపాదించిన ప్రతినిధి ఒకరు. ప్రభుత్వం ప్రతిపాదించిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఇద్దరు సభ్యులుగా ఉంటారు.

4) ఈ కమిటీ ఏర్పాటుచేసిన మూడు నెలల లోపు తొలి సమావేశం జరగాలి. ఆ తర్వాత ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో సమావేశమై అకడమిక్ సెషన్‌లో ప్రతి బాలుడి/ బాలికకు అయ్యే ఖర్చును మదింపు చేయాలి.

5) కమిటీ తీసుకున్న నిర్ణయం ఆధారంగా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్), జిల్లా విద్యాశాఖాధికారులకు 12, సెక్షన్ 8, సెక్షన్ 9 ఖర్చు గురించి చేయాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ గురించి సమాచారం అందించాలి. స్థలం, నిర్మాణం, పరికరాలు లేదా ఇతర సౌకర్యాలు ఉచితంగా లేదా తగ్గింపు ధరలతో పొందడం ద్వారా నిర్ధారిత సంఖ్యలో పిల్లలకు విద్యను అందిస్తున్న పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే అర్హత ఉండదని తెలియపరచాలి.

6) విద్యాసంవత్సరంలో పాఠశాలకు రీయంబర్స్‌మెంట్ రెండు వాయిదాలలో చెల్లిస్తారు. మొదటి వాయిదా 50 శాతం సెప్టెంబర్ నెలలో, మిగతాది జనవరి నెలలో చెల్లిస్తారు. ఈ చెల్లింపులు నేరుగా RTGS (Real Time Gross Settlement) జాతీయ ఎలక్ట్రానిక్ ఫండ్ బదిలీ (NEFT) విధానం ద్వారా చేస్తారు. ఇందుకోసం పాఠశాలలు బ్యాంకులో ప్రత్యేక ఖాతా తెరవాల్సి ఉంటుంది.

7) రీయంబర్స్‌మెంట్ కోసం చట్టంలోని సెక్షన్ 12 కింద ప్రవేశం పొందిన విద్యార్థుల జాబితాను పాఠశాల జులై నెలలో జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాలి. మొదటి వాయిదా చెల్లింపునకు ముందు పిల్లల నమోదును జిల్లా విద్యాశాఖాధికారి వాస్తవమైనదిగా నిర్ధారించాలి. ప్రతి పిల్లవాడి హాజరు ప్రతినెల కనీసం 80 శాతం ఉండాలి. దీనితోపాటు నమోదు చేసిన అభ్యసన ఫలితాలు, నమోదు వివరాలు వాస్తవమైనదిగా జిల్లా విద్యాశాఖాధికారి నిర్ధారించుకున్న తరువాత జనవరి నెలలో చివరి వాయిదాను విడుదల చేయాలి.

8) చట్టంలోని సెక్షన్ 12 కింద ప్రత్యేక పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల పేర్లను పాఠశాల వారీగా ఎలక్ట్రానిక్ రూపంలో నిర్వహించాలి. దీనిని 9వ నియమంలో సబ్‌రూల్ (3) కింద ఏర్పాటైన కమిటీ నిర్ధారించిన విధంగా ప్రదర్శించాలి.

## 11. ప్రవేశం కోసం జనన ధృవీకరణ పత్రం

జనన, మరణ రిజిస్ట్రేషన్ చట్టం-1886 ప్రకారం జనన ధృవీకరణ పత్రం పొందలేకపోయినప్పుడు దిగువ తెలిపిన ఏదైనా ఒక పత్రం వయస్సు ధృవీకరణకు ఉపయోగించి పాఠశాలలో ప్రవేశం కల్పించాలి.

అ) వైద్యశాల లేదా ఎ.ఎన్.ఎం. రిజిష్టర్ రికార్డు

ఆ) తల్లి/ తండ్రి/ సంరక్షకుడు ఇచ్చిన స్వీయ ప్రకటన (Self Declaration)

- ప్రవేశం పొందిన ఆరు నెలల లోపు సమర్థాధికారి (Competent Authority) నుండి జనన ధృవీకరణ పత్రం తీసుకుని సమర్పించవచ్చు.

## 12. ప్రవేశం

### ప్రవేశం-సాధరణ కాలవ్యవధి

ఈ చట్టం ఉద్దేశాల ప్రకారం ఏ పాఠశాలలోనైనా ప్రవేశానికి సాధారణ కాలవ్యవధి విద్యా

సంవత్సరంలో జూన్ 12 నుండి ఆగస్టు 31 వరకు ఉంటుంది. విద్యాసంవత్సరం ప్రారంభం అంటే జూన్ 12కు ముందు లేదా ఆ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ఏ ఇతర తేది వరకైనా ప్రవేశాలు కల్పించవచ్చు.

## 13. ప్రవేశం - గడువు పొడిగింపు

అ) సాధారణ కాలవ్యవధి ముగిసినప్పటి నుంచి 3 నెలల వరకు ప్రవేశ అవకాశాన్ని పొడిగించవచ్చు.

ఆ) పొడిగించిన కాలం తర్వాత ఒకవేళ బాలుడు/ బాలిక ప్రవేశం పొందితే, ప్రధానోపాధ్యాయులు నిర్ణయించిన ప్రకారం శిక్షణతో వారు తమ చదువును పూర్తి చేయవచ్చు.

అనాథల విషయంలో వారు వచ్చిన ప్రాంతంలోని సంస్థ అధికారి తగిన ధృవీకరణ పత్రంతో పాటు వారి సంరక్షకుల విన్నపంపై వెంటనే పాఠశాల ప్రధానాచార్యులు వారికి పాఠశాలలో ప్రవేశం కల్పించాలి. ఇందుకోసం ప్రతి తరగతిలో గరిష్టంగా ‘3’ సీట్ల వరకు పెంచి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సంబంధిత అధికారుల నుండి ప్రధానాచార్యులు అనుమతి పొందాలి.

## 14. పాఠశాల గుర్తింపు

1) కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించిన పాఠశాలలు కాకుండా ఇతర పాఠశాలలు చట్టం అమలుకు ముందు లేదా తర్వాత మాధ్యమిక విద్యనందించడానికి స్థాపించబడి ఉంటే చట్టం అమలులోకి వచ్చిన ‘3’ నెలల లోపు అనుబంధంలో చూపిన విధంగా ఫామ్ నెం. 1లో సెల్ఫ్ డిక్లరేషన్‌తో కూడిన దరఖాస్తును చట్టంలోని సెక్షన్ 18 కింద గుర్తింపునిచ్చే అధికారి అయిన జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాలి. ఈ దరఖాస్తులో చట్టంలోని సెక్షన్ 12లో సబ్ సెక్షన్-2 క్లాజ్ (సి)లో పేర్కొన్న నిబంధనల ప్రకారం పాఠశాల పరిసర ప్రాంత స్థలాన్ని స్పష్టంగా తెలపాలి. ఈ దరఖాస్తును జిల్లా విద్యాశాఖాధికారి పేర మండల విద్యాశాఖాధికారి ద్వారా డి.ఇ.ఓ.కి సమర్పించాలి. దీనికి ముందు ప్రజానీకానికి అందుబాటులో ఉంచడానికి ఉద్దేశించిన వెబ్‌సైట్‌లో (ఎలక్ట్రానిక్ ఫామ్‌లో) పాఠశాల సమాచారాన్ని పొందుపరచాలి. వెబ్‌సైట్‌లో ఈ సమాచారాన్ని పూరించగానే ఒక రిజిస్ట్రేషన్ నెంబర్‌తో కూడిన రశీదును తీసుకోవాలి. తర్వాత దీనిని దరఖాస్తుతో జతచేస్తూ మండల విద్యాశాఖాధికారి ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాలి.

2) చట్టంలోని సెక్షన్-19లో పేర్కొన్న షరతులు, నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తూ గుర్తింపును కోరడాన్ని ధృవీకరించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాల తనిఖీ చేసే అథారిటీకి (ఒకవేళ తనిఖీ చేసే అధికారి జిల్లా విద్యాశాఖాధికారి కాకపోతే) గుర్తింపు మంజూరు చేసేందుకు సంబంధిత సమాచారాన్ని అడిగి తెలుసుకునే అధికారం ఉంది. అలాగే వీరు గుర్తింపు కోసం చేసిన దరఖాస్తులో తెలిపిన సమాచారం ధృవీకరించే రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు.

3) చట్టంలోని సెక్షన్ 19, 25ల కింద నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు పాఠశాల పాటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సంతృప్తి చెందితే అనుబంధంలో చూపిన విధంగా ఫామ్-2లో గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజులలోపు గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాలి. ఇది 3 సంవత్సరాల వరకు చెల్లుబాటు అవుతుంది.

**దిగువ తెలిపిన షరతులకు లోబడి గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని జారీచేయాలి.**

అ) పాఠశాల 1860 సొసైటీల రిజిష్టర్ చట్టం (21 ఆఫ్ 1860) ప్రకారం రిజిష్టర్ అయిన సొసైటీ నడుపుతోందని లేదా చట్ట ప్రకారం ఏర్పడిన పబ్లిక్ ట్రస్టు ద్వారా అమలులో ఉందని తెలపాలి.

ఆ) పాఠశాల ఏ ఒక్క వ్యక్తి గాని, సంస్థ గాని, వ్యక్తుల సమూహం గాని లాభార్జన కోసం నడిపేది కాకుండా ఉండాలి.

ఇ) రాజ్యాంగంలో పొందుపరచిన విలువలకు పాఠశాల కట్టుబడి ఉందని తెలపాలి.

ఈ) రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం ఏ అధికారికి అధికారమిస్తే ఆ అధికారి పాఠశాలలను ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చు.

ఉ) పాఠశాల ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, కమీషనర్ & డైరెక్టర్ పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖాధికారికి అవసరమైన సమాచారం, నివేదికలు అందజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం సూచనలకు లోబడి గుర్తింపునకు సంబంధించిన షరతులను పాటించేలా చర్యలు తీసుకోవాలి.

ఎ) చట్టంలోని సెక్షన్ 19 కింద నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను పాటించాలి.

ఏ) పాఠశాల తన సమీప ప్రాంత పరిధిలోని బలహీన వర్గాల పిల్లలకు ప్రతికూల బృందాల పిల్లలకు ఒకటో తరగతిలో కనీసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాలి. ఒకవేళ పాఠశాల ఎయిడెడ్ పాఠశాల అయితే ప్రవేశం పొందిన పిల్లల నిష్పత్తి ప్రకారం ఉచిత నిర్బంధ ఎలిమెంటరీ విద్యను అందించాలి.

ఐ) పూర్వ పాఠశాల విద్యను కలిగి ఉన్న పాఠశాల కూడా ప్రవేశాల ప్రారంభ దశలో చట్టంలోని సెక్షన్–12 కింద పేర్కొన్న విధంగా సమీప ప్రాంత పరిధిలోని బలహీన వర్గాల పిల్లలకు, ప్రతికూల బృందాల పిల్లలకు పాఠశాల నమోదుల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలి.

ఒ) విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు పిల్లల నుండి పాఠశాల వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రతి సంవత్సరం జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాలి.

ఓ) చట్టంలోని నిబంధనలకు పాఠశాల లోబడి ఉండాలి.

ఔ) గుర్తింపు పత్రంలో పేర్కొన్న షరతులను ఉల్లంఘించినట్లయితే పాఠశాల గుర్తింపును రద్దు చేస్తారు.

## 15. తాత్కాలిక ధృవీకరణ

1) చట్టంలోని సెక్షన్–25లో పేర్కొన్న విధంగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి లేకపోయినా చట్టం అమలులోకి వచ్చిన తేది నుండి ఆరునెలల వరకు పాఠశాల నడపడానికి జిల్లా విద్యాశాఖాధికారి అనుమతిస్తూ తాత్కాలిక ధృవీకరణ పత్రాన్ని అనుబంధంలో చూపిన ఫామ్–3ని జారీ చేయాలి. ఆరు నెలల గడువు పూర్తయిన తర్వాత చట్టంలో పేర్కొన్న విధంగా విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి ఉండేట్లు పాఠశాల చూడాలి.

2) చట్టంలోని సెక్షన్–25లో పేర్కొన్న నిబంధనలు పాటిస్తూ షెడ్యూల్‌లో పొందుపరిచిన నిబంధనలు, ప్రమాణాలు నెరవేర్చలేకపోయినప్పటికీ అనుబంధంలో ఉన్న ఫామ్–4లో చూపిన విధంగా పాఠశాలను '3' సంవత్సరాల వరకు నడపడానికి అనుమతిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి తాత్కాలిక ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. ఇచ్చిన గడువులోగా తాత్కాలిక ధృవీకరణ పత్రంలో పేర్కొన్న నిబంధనలు, ప్రమాణాలు నెరవేర్చినట్లు గుర్తింపు కోసం ఇచ్చిన ధరఖాస్తు పత్రంలో పేర్కొన్న వివరాలకు ధృవీకరణ పత్రంలో జారీ చేసిన అధికారి సంతృప్తి చెందినట్లయితే సబ్ రూల్–4 కింద పేర్కొన్న విధంగా గుర్తింపు పత్రాన్ని

జారీచేయవచ్చు. ఒకవేళ తాత్కాలిక ధృవీకరణ పత్రంలో ఇచ్చిన కాలవ్యవధిలోగా గుర్తింపును పాఠశాల కోరనట్లైతే ఆ పాఠశాలను గుర్తింపు పొందని పాఠశాలగా భావించాలి. గుర్తింపు పొందని పాఠశాలను నడపడం సెక్షన్ 19 ప్రకారం చట్టరీత్యా శిక్షార్హం.

3) చట్టం అమలులోకి వచ్చిన తర్వాత సెక్షన్ 18 కింద గుర్తింపు ధృవీకరణ పత్రం పొందకుండా నూతన పాఠశాలను నెలకొల్పకూడదు.

4) గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే అథారిటీ ప్రతి సంవత్సరం పాఠశాలను సందర్శించి షరతులు నెరవేరుస్తున్నారో, లేదో తనిఖీ చేయాలి.

## 16. గుర్తింపు ఉపసంహరణ

చట్టంలోని ప్రమాణాలు కొనసాగించడం, నిబంధనలు పాటించడం, గుర్తింపు షరతులను అనుసరించడంలో పాఠశాల విఫలమైనప్పుడు గుర్తింపు పత్రాన్ని జారీ చేసే అధికారి గుర్తింపు రద్దు గురించి తెలిపే షోకాజ్ నోటీసు ఇవ్వాలి. దీనికి సమాధానం ఇవ్వడానికి పాఠశాలకు కనీసం ఒక నెల వ్యవధి ఇవ్వాలి. ఒకవేళ పాఠశాల ఇచ్చిన జవాబుకు సంతృప్తి చెందనట్లయితే గుర్తింపు ఉపసంహరణ నిర్ణయం తీసుకోవడానికి ముందు పాఠశాలకు వివరణ వినిపించే అవకాశం ఇవ్వాలి. గుర్తింపు రద్దు ఉత్తర్వులు రాతపూర్వకంగా ఇవ్వాలి. ఈ ఉత్తర్వులు వెంటనే వచ్చే విద్యాసంవత్సరం నుండి అమలులోకి రావాలి. గుర్తింపు రద్దు చేయబడిన పాఠశాల విద్యార్థులు చేరడానికి పరిసర ప్రాంత పాఠశాల/ పాఠశాలల పేర్లను కూడా గుర్తింపు రద్దు చేస్తున్నట్లు ఇచ్చే ఉత్తర్వులలో పొందుపరచాలి.

## 17. విన్నపం (Appeal)

గుర్తింపు రద్దు ఉత్తర్వులు పొందిన పాఠశాల సబ్ రూల్ (5) లేదా సబ్ రూల్ (8) ప్రకారం రద్దు ఉత్తర్వులు పొందిన తేదీ నుండి 15 రోజులలో జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ అప్పీలు స్వీకరించాలో లేదో నిర్ణయిస్తారు. ఒకవేళ స్వీకరిస్తే అప్పీలుపై తుది నిర్ణయాం తీసుకునేంతవరకు గుర్తింపు రద్దు ఉత్తర్వుల అమలు ఆపివేస్తారు. కలెక్టర్ ఇరుపక్షాల వాదనలు వినిపించే అవకాశం ఇస్తారు. ఆ తర్వాత అప్పీలు చేసిన తేదీ నుండి రెండు నెలల లోపు తుది ఉత్తర్వులు జారీ చేస్తారు. జిల్లా కలెక్టర్ ఇచ్చే ఉత్తర్వులు తుది ఉత్తర్వులు.

## 18. పునశ్చరణ (Revision)

అ) ఏ పాఠశాలకైనా గుర్తింపును రద్దుపరుస్తూ జిల్లా కలెక్టర్ గారు ఇచ్చిన

ఉత్తర్వులను కమీషనర్ & డైరెక్టర్, పాఠశాల విద్య పునశ్చరణ చేయవచ్చు.

ఆ) అప్పీలేట్ అధికారి ఇచ్చిన ఉత్తర్వులు, ఇచ్చిన తేదీనుండి 30 రోజుల లోపు స్థానిక కమీషనర్ & డైరెక్టర్ గారికి అప్పీలు చేసుకోవాలి.

ఇ) ఏ పాఠశాలైనా గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని పొందితే ఆ సమాచారం స్థానిక అథారిటీకి పంపించాలి. నగర ప్రాంత పాఠశాల అయితే నగర స్థానిక సంస్థకు, గ్రామీణ పాఠశాల అయితే గ్రామపంచాయితీకి సమాచారాన్ని పంపించాలి. అప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలో గుర్తింపు పొందిన పాఠశాల ఉన్నట్లు తెలుసుకుంటారు.

## 19. పాఠశాల యాజమాన్య కమిటీ (School Mamagement Comittee)

1) చట్టం అమలులోకి వచ్చిన ఆరు నెలలలోపు అన్‌ఎయిడెడ్ పాఠశాలలు తప్ప ప్రతి పాఠశాలలో ఆ పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్.యం.సి.) ఏర్పాటుచేయాలి. ఈ కమిటీని ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి పునరుద్ధరించాలి.

2) కమిటీ ఏర్పాటు కింద విధంగా ఉంటుంది.

అ) ప్రాథమిక పాఠశాల అయితే కమిటీలో 27 మంది సభ్యులుంటారు. వీరిలో 24 మంది పాఠశాలలో నమోదైన పిల్లల తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాళ్ళ నుండి ఉంటారు. ఒక సభ్యుడు ఎన్నుకోబడిన ప్రతినిధి అయితే సంబంధిత గ్రామ మహిళా సమాఖ్యలు నామినేట్ చేసిన సభ్యులు మరొకరు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు/ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కమిటీకి ఎక్స్ అఫీషియో సభ్యులు/ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

ఆ) ప్రాథమిక పాఠశాలలో సభ్యుల ఎంపిక కిందివిధంగా ఉంటుంది.

1) గత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షలలో 1, 2, 3, 4 తరగతులలో అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థి తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి ఒకరు చొప్పున).

2) గత విద్యాసంవత్సర వార్షిక పరీక్షలలో 1, 2, 3, 4 తరగతులలో అతి తక్కువ శాతం మార్కులు సాధించిన విద్యార్థి తల్లి/తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి ఒకరు చొప్పున).

3) గత విద్యాసంవత్సర వార్షిక పరీక్షలలో అత్యధిక శాతం మార్కులు సాధించిన 1,2,3,4 తరగతులలో (ప్రతి తరగతిలో) ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థి తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి 4 గురు చొప్పున).

4) పట్టణ ప్రాంతాలలో పాఠశాలలో ఉన్న వార్డు కార్పోరేటర్/ కౌన్సిలర్, గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు (ఒకరు).

5) కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు/ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు (ఒకరు).

6) పేరు పొందిన విద్యావేత్త లేదా దాత లేదా పరిసర ప్రాంతంలో పాఠశాలకు సహకరించే వ్యక్తి లేదా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి (ఎస్.యం.సి. ద్వారా కో-ఆప్ట్ చేయబడినవారు (ఒకరు).

7) పాఠశాల యాజమాన్య కమిటీ మొత్తం సభ్యులలో 50 శాతం మహిళలుండాలి.

8) పాఠశాల విద్యార్థులలో ఇద్దరు యస్.యం.సి.లో ప్రత్యేక ఆహ్వానితులుగా ఉండాలి. ఒకవేళ పాఠశాలలో కో-ఎడ్యుకేషన్ ఉన్నట్లయితే ఈ ఇద్దరిలో ఒక బాలిక ఉండాలి.

ఇ) ప్రాథమికోన్నత పాఠశాలలో (ప్రాథమిక తరగతులు కూడా ఉన్నట్లయితే) పై సభ్యులకు దిగువ తెలిపిన సభ్యులను ఎంపిక చేసుకోవాలి.

1) గత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షలలో 5, 6 తరగతులలో అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థి తల్లి/తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి ఒకరు చొప్పున).

2) గత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షలలో 5, 6 తరగతులలో అతి తక్కువ శాతం మార్కులు సాధించిన విద్యార్థి తల్లి/తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి ఒకరు చొప్పున).

3) గత విద్యాసంవత్సరం వార్షిక పరీక్షలలో 5, 6 తరగతులలో అత్యధిక

శాతం మార్కులు సాధించిన ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థి తల్లి/తండ్రి లేదా సంరక్షకుడు/ సంరక్షకురాలు (తరగతికి 4 గురు చొప్పున).

3) తన పరిధిలో ఉన్న పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా గ్రామీణ ప్రాంతమైతే గ్రామ సర్పంచ్, మున్సిపల్ ప్రాంతం అయితే సంబంధిత కౌన్సిలర్/ కార్పోరేటర్ వ్యవహరిస్తారు.

    1) సభ్యుల నుండి ఒకరిని కమిటీ వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలి. ఒకవేళ కమిటీ ఛైర్‌పర్సన్ షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలు లేదా ఇతర వెనుకబడిన తరగతులు లేదా వైకల్యం కలిగి ఉన్న వర్గానికి చెందినవారు కానట్లయితే ఈ వర్గాలలో ఒకరిని వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలి.

4) తల్లిదండ్రుల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యుల నుండి మాత్రమే ఒకరిని వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలి.

    ఈ ఎన్నికలలో కమిటీ సభ్యులలో స్థానిక సంస్థ నుండి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, ప్రధానోపాధ్యాయులు లేదా ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులకు పాల్గొనే అర్హత లేదు. అలాగే వారికి ఎన్నికలలో ఓటుచేసే హక్కు కూడా లేదు.

5) పాఠశాల యాజమాన్య కమిటీ కనీసం నెలకు ఒకసారి సమావేశమై చేసే తీర్మానాలను, మినిట్స్‌ను రికార్డు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

6) సెక్షన్ 21 (2) లోని ఎ నుండి డి వరకు క్లాజులలో పేర్కొన్న విధులకు అదనంగా దిగువ తెలిపిన విధులను పాఠశాల యాజమాన్య కమిటీ నిర్వర్తించాల్సి ఉంటుంది.

    అ) చదవడం, రాయడం, సరళ గణిత పరిజ్ఞానం, అవగాహన వంటి అంశాలలో పిల్లల అభ్యసన ఫలితాలను ప్రతి తరగతికి చెందిన విద్యార్థుల నుండి రాండమ్‌గా ఎంచుకుని ప్రదర్శించమనడం. అలాగే పిల్లల, ఉపాధ్యాయుల గైర్హాజరుపై శ్రద్ధ చూపడం, ముఖ్యంగా పిల్లల గైర్హాజరును తగ్గించే చర్యలు చేపట్టడం.

    ఆ) పాఠశాల పరిసర ప్రాంతంలో ఉన్న పిల్లలందరి జాబితా నిర్వహించేలా చేయడం. బడి బయటి పిల్లలు పాఠశాలలో నమోదు అయ్యేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం.

ఇ) సెక్షన్ 24లోని ఎ, ఇ క్లాజులను, సెక్షన్ 28ని అమలుపరిచేట్లు చేయడం.

ఈ) పాఠశాలలో పరిసర ప్రాంత బాలలు నమోదై, ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేట్లు చూడడం.

ఉ) షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రమాణాలు, నిబంధనలు పాటించేట్లు పర్యవేక్షించడం.

ఊ) బాలల హక్కుల పరిరక్షణలో జరిగే ఏ చిన్న తప్పిదం గాని ముఖ్యంగా శారీర, మానసిక హింస, పాఠశాల ప్రవేశాన్ని వ్యతిరేకించడం, సెక్షన్ 3 (2) ప్రకారం అర్హత కలవాటిని సమకూర్చడం వంటి అంశాలను ఎప్పటికప్పుడు స్థానిక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం.

ఎ) సెక్షన్ 4లోని అంశాల అమలుకు అవసరాలను గుర్తించడం, ప్రణాళిక రూపొందించడం, పర్యవేక్షించడం.

ఐ) పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పర్యవేక్షించడం.

ఒ) పాఠశాల వార్షిక ఖర్చు, ఆదాయ వివరాలను రూపొందించడం.

7) పాఠశాలకు వచ్చిన నిధులను బ్యాంకులో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్, కన్వీనర్ ఉమ్మడిఖాతాలో జమచేయాలి. ఈ ఖాతాను ప్రతి సంవత్సరం, అవసరమైన సందర్భాలలో ఆడిట్ చేయటానికి అందుబాటులో ఉంచాలి. ప్రతి సంవత్సరాంతంలో నిధులు విడుదల చేసే అథారిటీకి వినియోగ ధృవీకరణ పత్రాలను సమర్పించాలి.

8) ఛార్టర్డ్ అకౌంటెంట్ లేదా లోకల్ ఫండ్ ఆడిటర్ లేదా సహకార శాఖ ఆడిటర్ ద్వారా పాఠశాల ఖాతాలను ఆడిట్ చేయించాలి.

## 20. పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన

1) పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి. ఇందుకోసం ముందుగా గ్రామసభను ఏర్పాటుచేయాలి. ఈ సభకు దిగువ తెలిపినవారిని ఆహ్వానించాలి.

- పాఠశాలలో నమోదయిన పిల్లల తల్లిదండ్రులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్యలు, పాఠశాల పరిసర ప్రాంతంలో విద్యారంగంలో పనిచేస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ ఉన్నట్లయితే ఆ సంస్థ ప్రతినిధి.

2) దిగువ తెలిపిన అంశాలు ఈ ప్రణాళికలో ఉండాలి.

అ) ప్రతి సంవత్సరం తరగతి వారిగా పాఠశాలలో చేరే వారి వివరాలు, సంఖ్య మొదలైన అంచనాలు.

ఆ) షెడ్యూల్‌లో తెలిపిన నిబంధనల ప్రకారం 1 నుండి 5, 6 నుండి 8 తరగతులకు విడివిడిగా కావాల్సిన అదనపు టీచర్ల సంఖ్య (ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు, పార్ట్‌టైం టీచర్లను కలుపుకొని).

ఇ) షెడ్యూల్‌లో తెలిపిన నిబంధనలు ప్రమాణాల మేరకు అవసరమయ్యే అదనపు భౌతిక నిర్మాణ సౌకర్యాలు, పరికరాల వివరాలు.

ఈ) పాఠశాల పారిశుద్ధ్యం, పాఠశాల భద్రత, ఆరోగ్యం & పరిశుభ్రత, బాలల వైకల్యాన్ని తొలిదశలోనే గుర్తించడానికి ప్రణాళికపై ప్రత్యేక దృష్టి సారించడం.

ఉ) పైన తెల్పిన "ఆ, ఇ" ల కోసం అదనపు ఆర్థిక అవసరాలు సంవత్సరం వారీగా ప్రణాళికలో పొందుపరచాలి. వాటిలో సెక్షన్ 4లో పేర్కొన్న ప్రత్యేక శిక్షణ కోసం కావాల్సిన నిధులు, బాధ్యతలు నిర్వర్తిండానికి కావాల్సిన అదనపు ఆర్థిక అవసరాలు ఏవైనా ఉంటే వాటి వివరాలు.

3) పై అంశాలపై రూపొందించిన పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్/ వైస్ చైర్‌పర్సన్, కన్వీనర్ సంతకం చేసి ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వానికి సమర్పించాలి.

## 21. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల వేతనం అలవెన్సులు సర్వీసు నిబంధనలు

ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల విషయంలో వేతనం, అలవెన్సులు, వారి సర్వీసు నిబంధనలు అమలులో ఉన్న శాసన నిర్మితం, నిబంధనల మేరకు పాఠశాల యాజమాన్యం నిర్ధారిస్తుంది.

## 22. ఉపాధ్యాయుల విధులు

1) సెక్షన్ 29లోని సబ్‌సెక్షన్ (2) క్లాజ్ (హెచ్)లో పేర్కొన్న అవసరాలను నెరవేర్చడానికి, సెక్షన్ 24లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం విధులు నిర్వర్తించడానికి ఉపాధ్యాయులు అభ్యసనాభివృద్ధి కార్యక్రమం లేదా ఇతర కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రతి విద్యార్థి

క్యుములేటివ్ రికార్డు నిర్వహించాలి. ఇది చట్టంలోని 30వ సెక్షన్, సబ్‌సెక్షన్ (2) లో పేర్కొన్న విధంగా చదువు పూర్తయినట్లు ఇచ్చే ధృవీకరణ పత్రానికి ఆధారమవుతుంది.

2) సెక్షన్ 24, సబ్ సెక్షన్ (1)లోని “ఎ” నుండి “ఇ” వరకు ఉన్న క్లాజులలో పేర్కొన్న విధులకు అదనంగా రెగ్యులర్ బోధనకు ఆటంకం కలగకుండా టీచరు తనకు కేటాయించిన దిగువ విధులను నిర్వర్తించాలి.

   అ) శిక్షణ కార్యక్రమాలలో పాల్గొనడం.

   ఆ) పాఠ్యప్రణాళిక రూపకల్పన, సిలబస్, శిక్షణా మాడ్యూల్స్, పాఠ్య పుస్తకాలు మెరుగుపరచడంలో పాల్గొనడం.

## 23. ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించడం

1) సెక్షన్ 21 కింద ఏర్పడిన పాఠశాల యాజమాన్య కమిటీ పాఠశాలలోని ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించే ప్రాథమిక స్థాయి వేదిక. ఒకవేళ ఈ కమిటీ ఇందులో విఫలమైతే మండల పరిషత్ స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (యం.పి.డి.ఓ.) చైర్‌పర్సన్‌గా మండల విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా ఏర్పడిన కమిటీ సమావేశమై సందర్భాన్ని బట్టి ఉపాధ్యాయుడు/ ఉపాధ్యాయిని ఇబ్బందులను తొలగించేందుకు ప్రయత్నిస్తారు.

2) జిల్లాస్థాయిలో ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగించే కమిటీ ఉంటుంది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ (చైర్మన్‌గా), పోలీసు సూపరింటెండెంట్, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లాపరిషత్, జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి, కమీషనర్ లేదా స్థానిక పట్టణ ప్రాంత ముఖ్య పురపాలక అధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమీషనర్ (సభ్యులుగా) జిల్లా విద్యాశాఖాధికారి (కన్వీనర్‌గా) ఉంటారు.

3) జిల్లాస్థాయి కమిటీ మూడు నెలలకొకసారి సమావేశం అవుతుంది.

4) రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వంచే నెలకొల్పబడి, రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వ నియంత్రణలో కొనసాగుతున్న పాఠశాలలోని ఏ ఉపాధ్యాయుడైన తన ఇబ్బందిని రాతరూపంలో జిల్లా స్థాయి కమిటీ కన్వీనర్‌కి సమర్పించాలి. రాజీవ్ విద్యామిషన్ నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ పోర్టల్ ద్వారా కూడా ఉపాధ్యాయులు తమ ఇబ్బందులను సమర్పించవచ్చు. ఇబ్బంది గురించి విచారణ జరిపిన తర్వాత తగినదని భావిస్తే జిల్లా

స్థాయి కమిటీ ఇబ్బందినీ తొలగిస్తుంది. ఈ కమిటీ కన్వీనర్ తమ నిర్ణయాన్ని టీచర్స్‌కు చేరవేస్తారు.

5) కమిటీ టీచర్ల నుండి రాతపూర్వకంగా స్వీకరించిన ఇబ్బందులను తొలగించడమే కాకుండా సొంతంగా ఉపాధ్యాయుల సర్వీసు సంబంధిత విషయాలు ఇతర అనేక క్లెయిమ్‌ల స్థాయిని కూడా సమీక్షిస్తుంది.

6) ప్రతి ప్రైవేట్ పాఠశాల తమ ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించడానికి తనకంటూ ఒక యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి.

## 24. విద్యార్థి : ఉపాధ్యాయ నిష్పత్తిని కొనసాగించడం

1) చట్టం అమలులోకి వచ్చిన తేదీనుండి 3 నెలల కాలవ్యవధిలోపు కమీషనర్ & డైరెక్టర్, పాఠశాల విద్య, రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నియంత్రణలో ఉన్న ప్రతి పాఠశాలలో మంజూరైన ఉపాధ్యాయుల సంఖ్యను రాజీవ్ విద్యా మిషన్‌తో సంప్రదించి రాతపూర్వకంగా ఉత్తర్వులలో పేర్కొనాలి. సబ్ రూల్ (1) ప్రకారం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటే రాజీవ్ విద్యామిషన్, కమీషనర్ & డైరెక్టర్, పాఠశాల విద్య ఉత్తర్వు ఇచ్చిన ఆరు నెలల లోపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి.

2) ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు రాజీవ్ విద్యామిషన్ & పాఠశాల విద్య కమీషనర్ & డైరెక్టర్ ఉపాధ్యాయుల స్థానస్థితిని సమీక్షిస్తారు.

3) రెగ్యులర్ బేసిస్‌పై ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. ఒకవేళ రిక్రూట్‌మెంట్ ఆలస్యమైతే సంబంధిత పాఠశాల యాజమాన్య కమిటీకి అర్హత కలిగి, శిక్షణ పొందిన సిబ్బందిని తాత్కాలికంగా కన్సాలిడేటెడ్ రెమ్యూనరేషన్‌పై (పాఠశాల యాజమాన్య కమిటీ నిర్ణయించిన ప్రకారం) ఖాళీలు – ఉపాధ్యాయ నియామకం మధ్య అంతరాన్ని పూరించడానికై నియమించుకోవడానికి అనుమతినివ్వాలి.

4) పాఠశాలల్లో వేతనం చెల్లిస్తూ ఉపాధ్యాయులను డిప్యూటేషన్ ద్వారా వారి సేవలను ఇతర కార్యాలయాలు లేదా సంస్థలు వినియోగించుకుంటున్న సందర్భాల్లో అటువంటి డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి.

5) సెక్షన్ 25లోని సబ్‌సెక్షన్ (2)లో పేర్కొన్న నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వంలోని ఏ వ్యక్తి అయిన ఉల్లంఘిస్తే అతను/ ఆమెపై వ్యక్తిగత క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి. లేదా చెల్లించిన వేతనాలను తిరిగి వసూలు చేయాలి.

## 25. పాఠ్యప్రణాళిక, మూల్యాంకన విధానం - విద్యా విషయక అథారిటీ

1) చట్టంలోని సెక్షన్ 29లోని ఉద్దేశాల కోసం విద్యావిషయక అథారిటీగా రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణా మండలి వ్యవహరించాలి.

2) సబ్‌రూల్ (1) కింద నోటిఫై చేయబడిన అకడమిక్ అథారిటీ కింది అంశాల రూపకల్పనలో రాజీవ్ విద్యామిషన్‌తో సంప్రదింపులు జరపాలి.

- రాష్ట్ర పాఠ్య ప్రణాళిక చట్రం
- పాఠశాల మూల్యాంకన యంత్రాంగం/ విధి విధానం
- పాఠశాలల్లోని పిల్లలందరి కోసం నిరంతర సమగ్ర మూల్యాంకనం

పై వాటికి తోడు అకడమిక్ అథారిటీ ఇంకా :

అ) పిల్లల వయస్సుకు తగిన, వారి స్థాయికి సంబంధించిన సిలబస్, పాఠ్య పుస్తకాలు, ఇతర అభ్యసన సామాగ్రి రూపొందించడం.

ఆ) వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణలను మెరుగుపరచడం.

ఇ) నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ఆచరించేందుకు మార్గదర్శకాలను రూపొందించడం.

ఈ) పిల్లల అభ్యసన స్థాయిలు సాధించేందుకు సంస్థలు, వ్యక్తుల జవాబుదారీతనం పెంపొందించడానికి పనితీరు సూచికలను వృద్ధి పరచడం.

ఉ) నియమిత కాలంలోరెగ్యులర్‌గా వ్యక్తులు, సంస్థల పనితీరు మదింపును చేపట్టడం.

ఊ) పాలసీలు, కార్యక్రమాలు, పాఠ్యప్రణాళిక, పిల్లల అభ్యసన ఫలితాలు మొదలైన వాటిపై అధ్యయనాలు/ పరిశోధనలు చేపట్టడం.

ఎ) రెగ్యులర్ బేసిస్‌పై చట్టంలోని 2వ సెక్షన్, సబ్‌సెక్షన్ (ఎన్) iv వ క్లాజులో పేర్కొన్న పాఠశాలలను కలుపుకుని అన్ని పాఠశాలల్లో సంపూర్ణ గుణాత్మక మదింపు విధానాన్ని రూపొందించి అమలుచేయాలి.

## 26. ఎలిమెంటరీ విద్య పూర్తయినట్లు ధృవీకరణ పత్రాలు అందించడం

1) అనుబంధంలో ఉన్న ఫామ్–5లో చూపిన నమూనాలో మాధ్యమిక విద్య పూర్తయిన నెలలోపు మాధ్యమిక విద్యను పూర్తిచేసినట్లు ధృవీకరణ పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు/ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఇవ్వాలి. ప్రైవేటు పాఠశాల అయినట్లయితే ధృవీకరణ పత్రంపై పాఠశాల గుర్తింపు ధృవీకరణ పత్రంలోని సంఖ్యను స్పష్టంగా కనిపించేలా పాఠశాల ముద్రవేయాలి.

2) సబ్‌రూల్ (1) తెలిపిన విధంగా ధృవీకరణ పత్రంలో తప్పనిసరిగా :

అ) సెక్షన్ 29లో పేర్కొన్న అన్ని అధ్యయన కోర్సులు పూర్తిచేసినట్లు ధృవీకరించాలి.

ఆ) ధృవీకరణ పత్రంలో విద్యార్థి విద్యావిషయక అభ్యసనాభివృద్ధితో పాటు సంగీతం, నృత్యం, సాహిత్యం, క్రీడలు వంటి వాటిల్లో చూపిన ప్రతిభను కూడా పొందుపరచాలి.

## 27. విద్యాహక్కు పరిరక్షణ అథారిటీ (REPA) - వ్యవస్థీకరణ విధులు

1) చట్టం అమలులోకి వచ్చిన ఆరు నెలలలోపు రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు పరిరక్షణ అథారిటీని ఏర్పరుస్తుంది. ఇది బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమీషన్ ఏర్పడేంత వరకు అమలులో ఉంటుంది.

2) ఈ అథారిటీలో…

1) అథారిటీ చైర్‌పర్సన్‌గా…

అ) ఉన్నత విద్యావిషయక పరంగా పేరు పొందిన వ్యక్తి లేదా

ఆ) హైకోర్టు న్యాయమూర్తి లేదా

ఇ) బాలల హక్కుల పరిరక్షణకు గణనీయ కృషి చేస్తున్న వ్యక్తి

2) నలుగురు సభ్యులుగా కింది రంగాలకు చెందినవారు.

అ) విద్య

ఆ) చైల్డ్ హెల్త్‌కేర్ & చైల్డ్ డెవలప్‌మెంట్

ఇ) జువనైల్ జస్టిస్ లేదా

ఈ) బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

ఉ) చైల్డ్ సైకాలజీ లేదా సోషియాలజీ

ఊ) న్యాయవాద వృత్తి

3) జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (NCPCR) నియమాలు 2006 ప్రకారం కమీషన్ చైర్‌పర్సన్, సభ్యులకు చెందిన నియమాలు, షరతులే విద్యాహక్కు పరిరక్షణ అథారిటీ (REPA) చైర్‌పర్సన్, ఇతర సభ్యులకు యథాతథంగా వర్తిస్తాయి.

4) విద్యాహక్కు పరిరక్షణ అథారిటీ (REPA) కి చెందిన రికార్డులు, ఆస్తులన్నీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఏర్పడిన తక్షణం దానికి బదిలీ చేస్తారు.

5) బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమీషన్ లేదా విద్యాహక్కు పరిరక్షణ అథారిటీ తన విధులను నిర్వర్తిస్తూ సందర్భాన్ని బట్టి రాష్ట్ర సలహా మండలి అప్పగించిన విధులను కూడా నిర్వర్తిస్తుంది.

6) బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమీషన్ లేదా విద్యాహక్కు పరిరక్షణ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెల్‌ను ఏర్పరుస్తుంది. ఇది సందార్భాన్ని బట్టి చట్ట ప్రకారం విధులు నిర్వర్తించడంలో సాయం చేస్తుంది.

## 28. రాష్ట్ర సలహా మండలి ఏర్పాటు, విధులు

1) రాష్ట్ర సలహా మండలిలో చైర్‌పర్సన్, కో–చైర్‌పర్సన్, 13 మంది సభ్యులు ఉంటారు.

2) ఈ మండలికి ప్రాథమిక విద్యాశాఖ ఇంచార్జి మంత్రి ఎక్స్ అఫిషియో చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల విద్యాశాఖ ఇన్‌ఛార్జి మంత్రి ఎక్స్ అఫిషియో కో–చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

3) ఎలిమెంటరీ విద్య, చైల్డ్ డెవలప్‌మెంట్ రంగంలో సంపూర్ణ జ్ఞానం ఉండి ప్రత్యక్ష అనుభవం కలిగి ఉన్న వ్యక్తుల నుండి దిగువ తెల్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వ సలహా మండలి సభ్యులుగా నియమిస్తుంది.

అ) ఎస్.సి., ఎస్.టి., ఇతర వెనుకబడిన వర్గాలకు చెందినవారు, మైనారిటీల నుండి ప్రతివర్గం నుండి ఒకరిని చొప్పున కనీసం నలుగురు సభ్యులను నియమించాలి.

ఆ) ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యలో ప్రత్యక్ష అనుభవం, విస్తృత జ్ఞానం కలిగి ఉన్న వ్యక్తుల నుండి కనీసం ఒకరిని మండలి సభ్యులుగా నియమించాలి.

ఇ) పూర్వ ప్రాథమిక విద్యారంగంలో విస్తృత జ్ఞానం కలిగిఉన్న వ్యక్తుల నుండి కనీసం ఒకరిని సభ్యులుగా నియమించాలి.

ఈ) ఉపాధ్యాయ విద్యారంగంలో ప్రత్యక్ష అనుభవం, జ్ఞానం ఉన్న వ్యక్తుల నుండి కనీసం ఒకరిని సభ్యులుగా నియమించాలి.

4) మండలి సభ్యులుగా 50 శాతం మంది అంటే ఆరుగురు మహిళలు ఉండాలి.

5) ప్రాథమిక విద్య & సర్వ శిక్షా అభియాన్ ముఖ్యకార్యదర్శి మండలి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. పాఠశాల విద్య కార్యదర్శి కో–కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అలాగే మండలి సమావేశాలలో ప్రత్యేక ఆహ్వానితులుగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి, బి.సి. సంక్షేమశాఖ కార్యదర్శి మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి, స్త్రీ & శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, వైద్య, ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ, పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి పాల్గొంటారు. వీరితోపాటు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యులైన గుర్తింపు పొందిన ప్రతి ఉపాధ్యాయ సంఘం నుండి ఒక సభ్యుడు ప్రత్యేక ఆహ్వానితులుగా మండలి సమావేశాల్లో పాల్గొంటారు.

6) రాష్ట్ర సలహా మండలి మూడునెలలకొకసారి సమావేశం కావాలి. కనీసం 50 శాతం మంది సలహా మండలి సభ్యులు సమావేశానికి హాజరైనట్టయితే సమావేశం కోసం ఉన్నట్లుగా భావించాలి.

7) మండలి సభ్యుల నియామకపు నిబంధనలు, షరతులు :

అ) ప్రతి సభ్యుని పదవీకాలం తాను పదవి చేపట్టిన తేది నుండి 2 సంవత్సరాలు ఉంటుంది. ఏ సభ్యుడు కూడా రెండు టర్మ్‌లకు మించి సభ్యులుగా కొనసాగడానికి వీలులేదు.

ఆ) రాష్ట్రప్రభుత్వం తన ఉత్తర్వుల ద్వారా ఎవరైనా సభ్యుడిని అతని దుష్ప్రవర్తన, అసమర్థత లేదా దిగువ తెలిపిన కారణాల వల్ల తొలగించవచ్చు.

1) దివాళాకోరుగా నిర్ణయించబడినప్పుడు

2) సరిగా నడుచుకోవడానికి తిరస్కరించడం లేదా నడుచుకోలేక పోయినప్పుడు.

3) మానసికంగా సరిగా లేనప్పుడు, సరిగా లేరని సంబంధిత న్యాయస్థానం తీర్పు చెప్పినప్పుడు.

4) ప్రజాప్రయోజనాల రీత్యా సభ్యుడు పదవిలో కొనసాగడం తగదని భావించినప్పుడు.

5) న్యాయస్థానం దోషిగా తీర్పుచెప్పినప్పుడు.

6) సెలవు పొందకుండా వరసగా రెండు మండలి సమావేశాలకు హాజరుకానప్పుడు.

ఇ) సభ్యుని మరణం వల్ల కానీ, రాజీనామా వల్ల కానీ మరేవిధంగానైనా ఖాళీ ఏర్పడ్డప్పుడు అటువంటి ఖాళీ ఏర్పడిన తేదీ నుండి 120 రోజులలో సబ్ రూల్ (3)లో తెల్పిన విధంగా సదరు ఖాళీలో మరో సభ్యుడిని నియమించాలి.

## 29. రద్దు & సేవింగ్స్

1) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్య కమీషనర్ & డైరెక్టర్ జారీచేసిన ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలు, నియమాలు, నిబంధనలు, ఎగ్జిక్యూటివ్ సూచనలు మొదలైనవి ఈ నియమాలతో పొంతన లేనప్పుడు అవి ఆ మేరకు రద్దు అయినట్లుగా భావించాలి.

2) ఏ అథారిటీ, అధికారి లేదా సంస్థ ఏ చట్టం, నియమం ఎగ్జిక్యూటివ్ సూచన కింద ఈ చట్టాన్ని బహిర్గత పరచిన తర్వాత, ఈ నియమాలు ప్రకటించడానికి ముందు తీసుకున్న ఏ చర్య అయినా మినహాయించ బడుతుంది. అలాగే చర్య తీసుకున్న అతడు/ ఆమె ఈ నియమాల కింద చర్య తీసుకున్నట్లుగానే భావించబడతారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
# సంగ్రహం

## పాఠశాల విద్య - ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు 2010 - సవరణ - విడుదల

## పాఠశాల విద్య (ప్రా.వి. - కార్యక్రమములు-1) ప్రభుత్వ శాఖ

ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య : 130 తేది : 09.09.2011

ఈ క్రింద పేర్కొనబడినది

1. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య - 20, పాఠశాల విద్య (ప్రా.వి-కార్యవర్తనములు-1), ప్రభుత్వ శాఖ తేది: 09.09.2011.
2. రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), హైదరాబాద్ వారి నుండి లేఖ సంఖ్య 165-1/రా.వి.మి(ఎస్.ఎస్.ఏ)/బి12/2009 తేది: 17.05.2011.

**ఉత్తర్వులు :**

1. మొదట ఉదహరించిన లేఖకు సంబంధించి విడుదల చేసిన ఆం.ప్ర బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు నిబంధనలు, 2010.
2. రెండవ ఉదహరించిన లేఖానుసారముగా, రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారు ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు నిబంధనలు, 2010 నివేదించిన ప్రత్యామ్నాయ చేర్పుల నిబంధనలను అనుసరించి.
3. రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారు నివేదించిన నిబంధనలను పూర్తి స్థాయిలో పరీక్షించి తదనుగుణంగా ఆం.ప్ర, బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు నియమాలకు మార్పులు సూచిస్తూ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య.20, పాఠశాల విద్య (ప్రా.వి-కార్యవర్తనములు1), ప్రభుత్వశాఖ ద్వారా తేది: 03.03.2011న జారీ చేయనైనది.
4. ఈ క్రింద ఉదహరించిన ప్రకటన ఆం.ప్ర ప్రభుత్వము యొక్క అసాధారణ రాజ పత్రమునందు ప్రచురించబడును.

# ప్రకటన

బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టము - 2009 (2009 చట్టము సంఖ్య 35 నుండి) విభాగము 38 మరియు ఉప-విభాగము (1) వల్ల సంక్రమించిన అధికారముతో, ఆం.ప్ర ప్రభుత్వము ఈ క్రింద సూచించిన విధముగా ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టమునకు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 20, పాఠశాలవిద్య (ప్రా.వి-అనువర్తనము-1) ప్రభుత్వ శాఖ తేది:3.3.2011 సవరణలు చేయనైనది.

# సవరణలు

చెప్పిన నియమాలలో :

1) నియమము19, ఉపనియమము(2) నందు ఈ విధముగా ప్రత్యామ్నాయము సూచించనైనది. అనగా

(a) పాఠశాలలోని అందరి పిల్లల యొక్క తల్లిదండ్రులు/సంరక్షకులు పాఠశాల నిర్వహణ బృందాన్ని (SMC) ఎన్నుకొందురు. దీనిని చేయిఎత్తిగాని, మూజువాణి ఓటు ద్వారా గాని లేక రహస్య ఓటు హక్కు ద్వారా గాని, అధిక సంఖ్యాబలంతో (Majority) యీ క్రింద సూచించిన విధంగా ఎన్నుకొందురు.

I. సాధారణ వర్గం (Gen Cat) నుండి ఇద్దరు తల్లిదండ్రులను.

II. ఒక్కొక్క తల్లిదండ్రులను షెడ్యూల్డు తెగలనుండి, వెనుకబడిన కులాల నుండి మరియు అల్పసంఖ్యాక వర్గాల నుండి.

(b) తల్లి దండ్రుల యొక్క సభ్యుల సంఖ్య ప్రాథమిక పాఠశాలలో 30 వరకు, ఎగువ ప్రాథమిక పాఠశాలకు 8 వ తరగతి కూడా చేర్చినట్లయితే 48, మరియు ఉన్నత పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు 30. ఒక వేళ విద్యార్థుల సంఖ్య 30 లోపు ఉన్నట్లయితే అందరి పిల్లల తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణ బృందంగా రూపొందుదురు. ప్రధానోపాధ్యాయుడు లేక (ఇంచార్జి, ప్రధానోపాధ్యాయుడు కన్వీనరు సభ్యుడిగా) నుండవలేను. స్థానిక వార్డుమెంబర్/పంచాయితిమెంబర్ కూడా ఒక సభ్యుడిగా ఉండును. పట్టణ సముదాయములో కార్పొరేటర్ కౌన్సిలరు కూడా సభ్యుడగును. కనీసం 50శాతం స్త్రీ సభ్యులు ఉండవలెను. ప్రధానోపాధ్యాయుడు రాత పూర్వకముగా అందరి తల్లిదండ్రులకు తెలియజేసి తల్లిదండ్రుల/

సంరక్షకులను సమావేశపరచి ఎన్నిక కార్యక్రమమును నిర్వహించవలెను. కనీసం 50% మంది తల్లిదండ్రులు ఎన్నిక సమయంలో హాజరు అయి ఉండవలెను.

c) ప్రత్యేక ఆహ్వానితుడిగా ఒక ప్రముఖ సామాజిక సేవాసంస్థ యొక్క సభ్యుడిని నియమించుకోవలెను ప్రత్యేక ఆహ్వానితులుగా ఒక అంగన్‌వాడి కార్యకర్తను, పాఠశాల ప్రాంతంలోని ఆరోగ్య ఉపకేంద్రం నుండి ANM ను, మహిళ సమతా సంఘం నుండి ప్రాంతీయ సమాఖ్య యొక్క ముఖ్యురాలిని మరియు పాఠశాలలో చురుకుగా పాల్గొనే ఇద్దరు పిల్లలను అందులో బాల బాలికల పాఠశాల అయినచో, ఒక్కరైనా బాలిక ఉండవలెను.

2) 22వ నియమములో,

(i) క్లాజు (b)తరువాత ఉపనియమము (3) నందు. యీ క్రింద విధముగా చేర్చవలెను. అనగా,
(ii) రాష్ట్ర విద్యాసంబంధిత అధికారి ద్వారా సమయానుకూలముగా సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు తమ తమ తరగతి విషయములకు బాధ్యత వహించవలెను.
(iii) ఒక వేళ ఎవరైన బాలల నిర్వహణ రాష్ట్ర విద్యాసంబంధిత అధికారి సూచించిన ప్రమాణాలకు 60శాతం కన్న తక్కువగా పడిపోయినట్లయితే, అట్టి ఉపాధ్యాయుడు పూర్తి విద్యాసంవత్సరంగాని, సంవత్సరంలో అధిక భాగముగాని పని చేసి ఉన్నట్లయితే అట్టి ఉపాధ్యాయునిపై స్థానిక అధికారి యొక్క నిర్దేశానుసారంగా నియమించిన అధికారి అట్టి విషయాన్ని గంభీరమైన తప్పిదముగా గుర్తించి CCA నియమాల్లోని, నియమము (9) ప్రకారంగా శిక్షార్హుడగును.
(iv) విద్యా సంవత్సరంలో బాల బాలికల నిర్వహణ రాష్ట్ర విద్యాసంబంధిత అధికారి సూచించిన ప్రమాణాలకు 90 శాతం కన్నా ఎక్కువగా ఉన్నచో, అట్టి ఉపాధ్యాయుడు పూర్తి విద్యాసంవత్సరంగాని, సంవత్సరంలో అధిక భాగముగాని పని చేసి ఉన్నట్లయితే, అతని మీద ఎటువంటి ఆక్షేపణలు లేనట్లయితే నియమము 22(4) ప్రకారం అతనిని స్థానిక అధికారులతో జిల్లా/రాష్ట్రం యొక్క ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారమునకు సంబంధిత అధికారులు సిఫార్సు చేయవలెను.
(ii) ఉపనియమము (3) తరువాత యీ క్రింద పొందుపర్చిన విషయాన్ని చేర్చవలెను. అనగా,
(4) ఈ చట్టం యొక్క విభాగము 17(1) ఉల్లంఘన చాలా గంభీరమైన తప్పిదముగా భావించి, ఆంధ్రప్రదేశ్ పౌరసేవల (ccA) నియామాలు 1991లోని నియమము–9 అనుసారముగా మరియు భారతీయ శిక్షాస్మృతిలోని విభాగము 323 అంతర్గతముగా శిక్షార్హులవుదురు.

3. నియమము 25 లోని, ఉపనియమము (2) ప్రకారముగా,

(a) క్లాజు (d) నందు వ్యక్తులు అన్న పదము తరువాత ఉపాధ్యాయులు అని చేర్చవలెను.

(b) క్లాజు (e) నందు వ్యక్తులు అన్న పదము తరువాత ఉపాధ్యాయులు అని చేర్చవలెను.

4. నియమము 28 తరువాత యీ క్రింద విధముగా చేర్చవలెను, అనగా.
"28A బాలల యొక్క ఉపద్రవనివారణ చర్యలు.

1) గ్రామపంచాయితీ బాలల, తల్లిదండ్రుల మరియు ప్రజల యొక్క మొదటి స్థాయి ఉపద్రవనివారణ ఉపకరణముగా పని చేయవలెను.

2) మండల పరిషత్ స్థాయిలో, మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు చైర్మన్‌గా, మండల పరిషత్తు, అభివృద్ధి అధికారి సభ్యుడిగా మరియు మండలవిద్యాధికారి కన్వీనరుగా గ్రామపంచాయితీ ఆదేశాలను పునర్విచారణ చేసే అధికారం కలిగి ఉంటారు.

3) బాలల, తల్లి దండ్రుల మరియు ప్రజల యొక్క ఉపద్రవనివారణకు ఒక జిల్లా స్థాయి ఉపద్రవ నివారణ బృందము ఏర్పడును.

4) జిల్లా స్థాయి ఉపద్రవ నివారణ బృందము నందు జిల్లాపరిషత్ అధ్యక్షుడు అధ్యక్షుడు గానూ, జిల్లా కలెక్టరు, జిల్లాపరిషత్ ముఖ్య నిర్వహణాధికారి, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), రాష్ట్ర పథక సంచాలకులు, విలీనబాలల అభివృద్ధి పథక సంచాలకులు, స్థానిక పట్టణ పరిశీలనాధికారి, శ్రామిక ఉప పరిశీలనాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి పథక అధికారి, సామాజిక సంక్షేమ ఉపసంచాలకులు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు, వెనుకబడిన జాతుల సంక్షేమ అధికారి సభ్యులుగా, మరియు జిల్లా విద్యాధికారి సభ్య కన్వీనరుగా ఉందురు. ఈ జిల్లా స్థాయి ఉపద్రవ నివారణ బృందము కనీసము నెలలో ఒక్కసారి సమావేశమగును. అంతేగాక ఉపద్రవ విషయాలను అనుసరించి ఎప్పుడవసరమున్నా సమావేశమగుదురు.

5) రాష్ట్రస్థాయిలో ప్రధానకార్యదర్శి (ప్రాథమిక విద్య), ప్రధానకార్యదర్శి (మాధ్యమిక విద్య), రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ) పథక సంచాలకులు, మరియు పాఠశాల విద్యా పరిశీలణాధికారి మరియు సంచాలకులతో బృందం ఏర్పాటు చేయనైనది.

6) ఉపద్రవ నివారణ మరియు పునర్విచారణ బృందం హక్కుల వివరాలు అనుబంధం-I లోను, మరియు పునర్విచారణ అధికారుల నివారణ విధివిధానాలు అనుబంధం-II లో పొందుపర్చబడినవి.

5. పాఠశాల విద్య పరిశీలనాధికారి మరియు పాఠశాల విద్య సంచాలకులు, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

వారి మరియు రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), వారునూ సరియైన చర్యలను చేపట్టెదరు.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ (రాజ్యపాల్) గారి పేరుతో మరియు ఆదేశాను సారముగా)

చందనాఖాన్
ప్రభుత్వ ప్రధానకార్యదర్శి (ప్రాథమిక విద్య)

వరకు
పరిశీలనాధికారి, ముద్రణ మరియు స్టేషనరీ, చంచల్‌గూడ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వు, (అసాధారణ) తేది 14.09.2011 నందు ప్రకటించుటకై మరియు 1000 కాపీలను ప్రభుత్వ పాఠశాల విద్యశాఖకు పంపించుటకై అభ్యర్ధనతో.
పరిశీలనాధికారి మరియు సంచాలకులు పాఠశాల విద్య, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.
రాష్ట్ర పథక సంచాలకులు, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.
సంచాలకులు, రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణా సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్.

**నకలు**

1. కార్యదర్శి, మానవ వనరుల అభివృద్ధి మంత్రాలయము, పాఠశాల విద్య మరియు అక్షరాస్యత శాఖ, భారత ప్రభుత్వము, న్యూఢిల్లీ.
2. ముఖ్యమంత్రి యొక్క ప్రత్యేక కార్యదర్శి యొక్క వ్యక్తిగత కార్యదర్శి.
3. పాఠశాల విద్య మరియు మాధ్యమిక విద్య గౌరవమంత్రి గారి యొక్క వ్యక్తిగత కార్యదర్శి.
4. ప్రధానకార్యదర్శి యొక్క వ్యక్తిగత కార్యదర్శి, (పాఠశాల విద్య మరియు మాధ్యమిక విద్య) ఆం.ప్ర మంత్రాలయము.
5. ప్రధానకార్యదర్శి యొక్క వ్యక్తిగత కార్యదర్శి, (మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమము మరియు వికలాంగ సంక్షేమ శాఖ.
6. న్యాయ (ఎ) శాఖ.
7. ఆర్ధిక శాఖ.
8. పాఠశాల విద్యాశాఖ అధ్వర్యంలోని మిగతా శాఖాధిపతులకు,
9. ఇంకొక నఖలు ఇంకొక దస్త్రము.

# అనుబంధం - I

## విద్యా హక్కు అమలులో బాధ్యులు, నిబంధనలు అమలు చేసే సంబంధిత అధికారులు

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 1. | పాఠ్యపుస్తకాలు | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 2. | యూనిఫామ్‌లు | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 3. | లేఖన సామాగ్రి | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 4. | గ్రంథాలయం | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 5. | క్రీడా సామాగ్రి | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 6. | ఆట వస్తువులు | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 7. | మధ్యాహ్న భోజనం | రూల్ 6(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 8. | బాలబాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు | రూల్ 6(1) | పి.ఓ., రా.వి.మి. మరియు ఎస్.ఇ., ఆర్.డబ్ల్యూ.ఎస్. | ఎస్.పి.డి./ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్.డబ్ల్యూ.ఎస్. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 9. | త్రాగునీరు | రూల్ 6(1) | పి.ఓ., రా.వి.మి. మరియు ఎస్.ఇ., ఆర్.డబ్ల్యూ.ఎస్. | ఎస్.పి.డి./ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్.డబ్ల్యూ.ఎస్. | ఎస్.సి.పి.సి.ఆర్. |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 10. | ఎలిమెంటరీ స్థాయి వరకు ఉచిత విద్య | రూల్ 3(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 11. | బదిలీ ధృవీకరణ పత్రం | రూల్ 5(1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 12. | వయస్సు వారీగా తరగతిలో ప్రవేశం | రూల్ 4 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 13. | రవాణా సౌకర్యం | రూల్ 5(4) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి/ పి.ఓ. | ఎస్.పి.డి. |
| 14. | ఆవాస సౌకర్యం | రూల్ 5(4) | పి.ఓ. | ఎస్.పి.డి. | ఎస్.పి.డి. |
| 15. | కాలానుగుణ వసతి గృహాలు | రూల్ 5(4) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి/ పి.ఓ. | ఎస్.పి.డి. |
| 16. | రవాణా సౌకర్యం | రూల్ 5(4) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి/ పి.ఓ. | ఎస్.పి.డి. |
| 17. | అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో వారికి సరిపోయే తరగతి గదులను ప్రారంభించడం | రూల్ 5(5) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఆర్.జె.డి.ఎస్.ఇ. |
| 18. | ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇంటి వద్దనే విద్యను అందించడం | రూల్ (5)7 | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఎస్.పి.డి. |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 19. | ప్రత్యేక అవసరాలు గల పిల్లల కొరకు ప్రత్యేక కార్యక్రమాలు | | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | పి.ఓ., రా.వి.మి. |
| 20. | 1) పాఠశాల భవనాలు, అభ్యసన,<br>2) మౌళిక వసతులతో పాటు, పాఠశాల భవనాలు, అభ్యసన సామాగ్రిని చేకూర్చడం | 8 (డి)<br>8 (డి) | 1) పి.ఓ., రా.వి.మి.<br>2) జిల్లా విద్యా శాఖాధికారి | ఎస్.పి.డి.<br>సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్.<br>ఎస్.సి.పి.సి.ఆర్. |
| 21. | ఉపాధ్యాయ సిబ్బంది | | | | |
| 22. | వివక్షత లేకుండా చూడడం | 9 (సి) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా కలెక్టర్ |
| 23. | 14 సంవత్సరాల వరకు రికార్డులను నిర్వహించడం | 9 (డి) | ఎస్.ఎమ్.సి. | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 24. | విద్యార్థుల హాజరును గమనించడం మరియు ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయించడం | 9(ఇ) | ప్రధానోపాధ్యాయుడు | సర్పంచ్‌తో గ్రామ పంచాయతీ బాడీ | మండల విద్యా శాఖాధికారి |
| 25. | బడిబయటి పిల్లలకు ప్రత్యేక శిక్షణ | 9 (జి) & 4 | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి/ పి.ఓ. | ఎస్.పి.డి. |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 26. | నాణ్యతతో కూడిన ఎలిమెంటరీ విద్య | 9 (హెచ్) | సంబంధిత ఉపాధ్యాయుడు | ఎస్.ఎం.సి. | మండల విద్యా శాఖాధికారి |
| 27. | విద్యా ప్రణాళిక సంస్కరణలు & పాఠ్యపుస్తకాల పునర్విమర్శ (విద్యా ప్రణాళికను సిద్ధం చేయడం మరియు అధ్యయనాంశాలు) | 9 (ఐ) | ఎస్.సి.ఇ.ఆర్.టి. | సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 28. | ఉపాధ్యాయ శిక్షణలు | 9 (జె) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఎస్.పి.డి. |
| 29. | వలస కుటుంబాల విద్యార్థులకు పాఠశాల ప్రవేశం తప్పనిసరిగా కల్పించడం | 9 (కె) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి/ పి.ఓ. | ఆర్.జె.డి.ఎస్.ఇ. |
| 30. | పాఠశాల నిర్వహణ తీరు గమనించడం | 9 (ఎల్) | మండల విద్యా శాఖాధికారి | గ్రామపంచాయతి | ఎం.పి.డి.ఓ. |
| 31. | విద్యా క్యాలెండర్‌ను నిర్ణయించడం | 9 (ఎం) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఆర్.జె.డి.ఎస్.ఇ./ ఎస్.పి.డి. |
| 32. | పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం | 10 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | మండల పరిషత్ / ఎం.పి.డి.ఓ. హాజరు కానప్పుడు ఎన్నికోబడిన బాడీ |
| 33. | ప్రభుత్వ సహాయక పాఠశాలల్లో (ఎయిడెడ్) ప్రవేశం | | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి/ ఉప విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 34. | ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశం - 25% సీట్ల కేటాయింపు | 12 (సి) | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఆర్.జె.డి.ఎస్.ఇ. |
| 35. | నిర్దేశిత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రవేశం | | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి | ఆర్.జె.డి.ఎస్.ఇ./ ఎస్.పి.డి. |
| 36. | ప్రవేశ కాలపరిమితి పొడిగింపు | రూల్ 13 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 37. | వడపోత విధానం | 13 (1) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతి | మండల పరిషత్ |
| 38. | రుసుములు లేవు | 13 (1) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతి | మండల పరిషత్ |
| 39. | క్యాపిటేషన్ రుసుము లేదు | 13 (1) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతి | మండల పరిషత్ |
| 40. | పాఠశాల ప్రవేశానికి కనీస వయస్సును చెప్పే ఆధారాలు | 14 (1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 41. | వయో నిర్ధారణ ఆధారాలు లేవనే కారణంతో ప్రవేశాన్ని నిరాకరించడం తగదు | 14(2) & 15 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 42. | నిలుపుదల లేదు | 16 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 43. | బహిష్కరణ లేదు | 16 | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | జిల్లా విద్యా శాఖాధికారి |
| 44. | దండన చర్యలకు తావు లేదు | 17 (1) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | జిల్లా విద్యా శాఖాధికారి |
| 45. | మానసిక వేధింపులకు తావులేదు | 17 (1) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | జిల్లా విద్యా శాఖాధికారి |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 46. | గుర్తింపు లేని పాఠశాల ఉండకూడదు | 18 (1) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 47. | పాఠశాల ప్రమాణాలు మరియు కనీస ప్రాతిపదికలను పాటించడం | 19 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 48. | పాఠశాల యాజమాన్య కమిటీ పనితీరు | 21 | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | మండల పరిషత్ |
| 49. | పాఠశాల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయడం | 21 (బి) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యా శాఖాధికారి | జిల్లా విద్యా శాఖాధికారి |
| 50. | నిధుల వినియోగాన్ని గమనించడం | 21 (2) (బి) | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | జిల్లా విద్యా శాఖాధికారి/ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ |
| 51. | పాఠశాలకు ఉపాధ్యాయుడు సరైన సమయంలో సక్రమంగా హాజరు కావడం | 24 (2) (బి) | సంబంధిత ఉపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | మండల విద్యాశాఖాధికారి |
| 52. | విద్యా ప్రణాళికను అనుసరించడం & పూర్తి చేయడం | 24 (1) (బి) & (సి) | సంబంధిత ఉపాధ్యాయుడు | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి |
| 53. | అభ్యసన సామర్థ్యాలను మదింపు చేయడం మరియు | 24 (1) (బి) | సంబంధిత ఉపాధ్యాయుడు | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| | అవసరమైతే అదనపు బోధనా పద్ధతులు పెంపొందించడం | | | | |
| 54. | విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి | 25 (1) & (2) | జిల్లా విద్యాశాఖాధికారి | సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 55. | ఉపాధ్యాయ నియామకం మరియు ఇతరములు | 26 | జిల్లా విద్యాశాఖాధికారి | సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 56. | విద్యేతర కార్యాలకు ఉపాధ్యాయుల సేవలను వినియోగించడాన్ని నిషేధించడం | 27 | మండల విద్యాశాఖాధికారి | జిల్లా విద్యాశాఖాధికారి | సి & డి.ఎస్.ఇ. |
| 57. | ప్రైవేట్ బోధనను నిషేధించడం | 28 | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి | జిల్లా విద్యాశాఖాధికారి |
| 58. | నిర్దేశిత మూల్యాంకన విధానాన్ని పాటించడం, (సిసిఇ) సమగ్ర నిరంతర మూల్యాంకన పద్ధతిని అనుసరించడం | 29 (1) | డైరెక్టర్ ఎస్.సి.ఇ.ఆర్.టి. | సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 59. | విద్యా సంపూర్ణత ధృవీకరణ పత్రం | 30 (2) | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి | జిల్లా విద్యాశాఖాధికారి |

| క్ర. సం. | సామగ్రి | సెక్షన్ | అమలుచేసే అధికారులు | ప్రజాసమస్యల పరిష్కార అధికారులు | సంబంధిత అధికారులు |
|---|---|---|---|---|---|
| 60. | బోర్డు పరీక్ష లేదు | 31 | జిల్లా విద్యాశాఖాధికారి | సి & డి.ఎస్.ఇ. | ఎస్.సి.పి.సి.ఆర్. |
| 61. | యుక్తమైన బోధనా పద్ధతులు | | ఉపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి | డైరెక్టర్ ఎస్.సి.పి.సి.ఆర్. |
| 62. | పాఠశాల యాజమాన్య కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడం | | ప్రధానోపాధ్యాయుడు | గ్రామపంచాయతీ | మండల పరిషత్ |
| 63. | విద్యార్థులలో వాంఛిత సామర్థ్యాలను అభివృద్ధి చేయడం | | ఉపాధ్యాయుడు | ప్రధానోపాధ్యాయుడు | మండల విద్యాశాఖాధికారి |

# అనుబంధం - II

# ప్రజా సమస్యల పరిష్కార విధానం

**1. ప్రజా సమస్యల స్వీకరణ :**

బాధితుల నుంచి వారివారి సమస్యలను ఆయా స్థాయిలలోని అధికారులు స్వీకరిస్తారు. నిర్దేశిత నమూనాలో తమ సమస్యలను ప్రజలు స్వయంగా గాని, తపాల ద్వారా గాని, ఈ–మెయిల్ ద్వారా గాని, టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి గాని తెలియపరచవచ్చు. ఈ నమూనా పత్రములు నిర్దేశిత అధికారులందరి దగ్గర లభిస్తాయి. అయినప్పటికీ ప్రజలు తమ సమస్యలను నిర్దేశిత నమూనాలోనే ఇవ్వడం తప్పనిసరి కాదు. ప్రజా సమస్యను స్వీకరించిన తర్వాత సంబంధిత అభ్యర్థికి అధికారులు స్వీకరణ రశీదు పత్రాన్ని అందిస్తారు.

**2. ప్రజా సమస్యల నమోదు :**

ప్రజా సమస్య పత్రంను స్వీకరించిన వెంటనే నిర్ధారిత రిజిస్టర్‌లో ఆ సమస్యకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. అట్టి రిజిస్టర్‌ను నిరంతరం పర్యవేక్షక అధికారులు/ పరిశీలకులు/ రాష్ట్ర బాలల హక్కుల సంఘం మొదలగు వారి పరిశీలన మరియు మార్గదర్శకాల నిమిత్తం అందుబాటులో ఉంచాలి.

**3. ప్రజా సమస్యల పరిష్కారం :**

రశీదు స్వీకరణ పత్రంలో ఇచ్చిన విధంగా నిర్దిష్ట కాలపరిమితిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలను సంబంధిత అధికారి తీసుకుంటాడు. అవసరమైతే సంబంధిత అధికారి ప్రజల సమక్షంలోనే బహిరంగ విచారణను/ పరిశోధనను పారదర్శకంగా నిర్వహిస్తాడు. ప్రజా సమస్యకు కారణమైన వ్యక్తిపై అభియోగాలను పరిశోధించడానికి ఆ వ్యక్తి హోదా కన్నా తక్కువ స్థాయి కాని అధికారిని పరిశోధించడానికి నియమించాలి. అట్టి అధికారిపై ఎలాంటి ఆరోపణలు ఉండకూడదు. ప్రజా సమస్యలను స్వీకరించిన రోజు నుండి 2 మాసాల లోపు ఆ సమస్యను పరిష్కరించాలి. కాలపరిమితి 2 మాసాలు అయినప్పటికీ సమస్యల స్వభావం బట్టి సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించవచ్చు. సమస్య పరిష్కార ప్రక్రియ పూర్తి అయిన మరుక్షణమే అట్టి నిర్ణయాన్ని బాధితునికి నిర్దేశిత నమూనా లేఖ ద్వారా తెలియజేయాలి.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
## సంగ్రహం (అబ్‌స్ట్రాక్ట్)

**పాఠశాల విద్య – ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు 2010 – సవరణ – ఉత్తర్వులు – విడుదల**

**పాఠశాల (ప్రా.వి. – ఎస్.ఎస్.ఏ.) ప్రభుత్వ శాఖ**

జి.ఓ.ఎం.ఎస్. నెంబర్ : 41 తేది : 19.06.2013

ఈ క్రింద పేర్కొనబడినది :

1. ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు, 2010 – వెలువరించిన తదనుగుణ ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ&. 20, పాఠశాల విద్యా (ప్రా.వి.– కార్యక్రమాలు–I) ప్రభుత్వ శాఖ, తేది : 03.03.2011 మరియు రాజపత్రములోని ప్రకటన సంఖ్య : 10, తేది : 05.03.2011.
2. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 130, పాఠశాల విద్యా (ప్రా.వి. – కార్యక్రమాలు–I) ప్రభుత్వ శాఖ, తేది : 09.09.2011 రాజపత్రములోని ప్రకటన సంఖ్య : 42, తేది : 09.09.2011.
3. రాష్ట్ర పథక సంచాలకులు ఆర్.వి.యం.(ఎస్.ఎస్.ఏ.), ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ గారి లేఖ సంఖ్య 103/ఆర్.టి.ఇ. విభాగం/10/12, తేది : 30.11.2012 మరియు 01.03.2013.

× × ×

**ఉత్తర్వులు :**

1. ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు 2010 అనేది బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, 2009 (2009 చట్టం సెక్షన్ నెం. 35) ప్రకారం తేది : 05.03.2011 న ఆంధ్రప్రదేశ్ రాజపత్రం సంఖ్య : 10 అసాధారణ అనుబంధం భాగం–1లో ప్రకటించడం జరిగింది.
2. బాలల ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు నిబంధనలు 2010కి సవరణలు అసాధారణ ఆంధ్రప్రదేశ్ రాజపత్రం సంఖ్య : 42 లో తేది : 14.09.2011న ప్రకటించడం జరిగింది.

3. అదేవిధంగా, పైన పేర్కొన్న 3వ లేఖలో, రాష్ట్ర పథక సంచాలకులు, ఆర్.వి.ఎం. (ఎస్.ఎస్.ఏ.), ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ వారు తమ ప్రతిపాదనలో ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు, 2010కి సంబంధించి కొన్ని ప్రత్యామ్నాయ/ అదనపు నిబంధనలు చేర్చడం జరిగింది.

4. రాష్ట్ర పథక సంచాలకులు, ఆర్.వి.ఎం. (ఎస్.ఎస్.ఏ.), గారి ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించిన పిదప ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలను 2010 సవరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా తేది : 03.03.2011 మరియు ప్ర.ఉ.సంఖ్య :20, పాఠశాల విద్యా (ప్రా.వి. – కార్యక్రమాలు–I) ప్రభుత్వ శాఖ తేది : 03.03.2011 మరియు ప్ర.ఉ. సంఖ్య : 130, పాఠశాల విద్యా (ప్రా.వి. – కార్యక్రమాలు–I) ప్రభుత్వ శాఖ, తేది : 09.09.2011 సవరణ ఉత్తర్వులను విడుదల చేసింది.

5. కమీషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఆం.ప్ర., హైదరాబాద్ మరియు రాష్ట్ర పథక సంచాలకులు, ఆర్.వి.ఎం. (ఎస్.ఎస్.ఏ.) ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటారు.

6. ఆంధ్రప్రదేశ్ రాజపత్రం అసాధారణ సంచికలో తేది : 24.06.2013న ఈ క్రింది నోటిఫికేషన్ ప్రచురింపబడనున్నది.

**నోటిఫికేషన్ (ప్రకటన)**

బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (2009 లోని 35వ సెక్షన్ ప్రకారం) సెక్షన్–38 సబ్ సెక్షన్ (ఉప విభాగం) (1) ద్వారా ఇవ్వబడిన అధికారం ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్ర.ఉ. సంఖ్య : 20, పాఠశాల విద్యా (ప్రా.వి.–కార్యక్రమాలు–I) ప్రభుత్వశాఖ, తేది : 03.03.2011 నందు ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు నిబంధనలు, 2010కి సంబంధించి ఈ క్రింది సవరణలు చేయడం జరిగింది.

**సవరణలు**

పేర్కొనబడిన నిబంధనలు :

1. నిబంధన–1 లో ఈక్రింద పేర్కొన్న విధంగా మార్చడం జరిగింది.
   సంక్షిప్త శీర్షిక :– ఈ నిబంధనలను “ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు నిబంధనలు, 2010” లేదా ఎ.పి.ఆర్.టి.ఇ. రూల్స్, 2010గా పేర్కొనవచ్చు.

2. నిబంధన 3లోని ఉపనిబంధన (1) :-

i) క్లాజ్ (12) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

"(12) 'ఎలిమెంటరీ పాఠశాల' అంటే ఒక పాఠశాల 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు ప్రత్యేకంగా విద్యనందిచడం లేదా ఇతర తరగతుల్లోని చదువుకు అదనంగా ఇవ్వడం, మరియు ఒక ఉన్నత పాఠశాలను కలిగి ఉండడం లేదా ఎలిమెంటరీ విద్యను అందిస్తోన్న ఏ పేరుతోనున్న పాఠశాలనైనా "ఎలిమెంటరీ పాఠశాల" గా పరిగణించవచ్చు.

ii) క్లాజ్ (13) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

"(13) 'ఉచిత విద్య' అంటే ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో ఫీజు/ నిర్ణీత ఫీజు ఇతరములు లాంటి చెల్లింపులు లేకుండా పిల్లలందరికీ ఎలిమెంటరీ విద్యను అందించడం.

iii) క్లాజ్ (15) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

"(15) 'స్థానిక ప్రభుత్వం' అనగా చట్టంలో నిర్వచించబడిన విధంగా ఆ ప్రాంత పరిధిలోని మండల ప్రజాపరిషత్‌లు మరియు గ్రామపంచాయితీలు అని అర్థం.

iv) క్లాజ్ (20) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

"(20) 'ప్రాథమిక పాఠశాల' అంటే ఒక పాఠశాల గాని లేదా ఆ పాఠశాల లోని భాగం గాని 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యనందించే పాఠశాల మరియు ప్రాథమికోన్నత పాఠశాల అంటే ఒక పాఠశాల గాని లేదా ఆ పాఠశాలలోని భాగంగాని 6వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యనందించే పాఠశాల.

3. నిబంధన 5లోని ఉపనిబంధన (1) :-

i) క్లాజ్ (ఎ) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

(ఎ) 1వ తరగతి నుండి 5వ తరగతులకు సంబంధించిన పిల్లలకోసం పిల్లలు నడిచేంత దూరంలో అంటే ఆవాస ప్రాంతానికి 1 కి.మీ. లోపు కనీసం 20 మంది పాఠశాలకు వెళ్ళే పిల్లలను పరిగణనలోకి తీసుకొని ఆవాస ప్రాంతంలో ఒక పాఠశాలను తప్పనిసరిగా స్థాపించి అందుబాటు సదుపాయం కల్పించి వారికి గుణాత్మక విద్యను అందించాలి.

ii) క్లాజ్ (బి) ను ఈ క్రిందివిధంగా మార్చారు.

(బి) 6 నుండి 8వ తరగతులకు సంబంధించిన పిల్లలకోసం పిల్లలు నడిచేంత దూరంలో అంటే ఆవాస ప్రాంతానికి 3 కి.మీ. లోపు కనీసం పిల్లలు పాఠశాలకు వెళ్ళే సంఖ్యను పరిగణనలోకి తీసుకొని 3 కి.మీ. లోపే ఒక పాఠశాలను తప్పనిసరిగా ఏర్పాటుచేసి అందుబాటు కల్పించి వారికి గుణాత్మక విద్యను అందించాలి.

4. నిబంధన 19 :-

i) ఉపనిబంధన (1) ని ఈ క్రింది విధంగా మార్చారు.

(1) (ఎ) పాఠశాల యాజమాన్య కమిటీలను (ఎస్.ఎం.సి.) విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన 6 నెలల్లోపే అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో తప్ప అన్ని పాఠశాలల్లో ఏర్పాటుచెయ్యాలి.

(బి) ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతులు కలిగిన పాఠశాలకు మొత్తం పాఠశాలకు ఒకే పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటుచెయ్యాలి.

(సి) ఒకవేళ ఒక పాఠశాలలో ప్రాథమిక, మాధ్యమిక తరగతులున్నపుడు ప్రాథమిక విభాగానికి, విడిగా పాఠశాల యాజమాన్య కమిటీని ఏర్పాటుచేయాలి. దీనినే ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీగా పేర్కొనాలి.

(డి) పాఠశాల యాజమాన్య కమిటీ ఒకసారి ఏర్పాటుచేయబడిన తర్వాత రద్దు సమయం వరకు లేదా, కలిసిపోయే వరకు ప్రాథమిక పాఠశాల అయితే మండల విద్యాశాఖాధికారి సూచనల మేరకు ఇతర పాఠశాల కొనసాగుతుంది. అయితే కమిటీ సభ్యుల, వారి కాలపరిమితి చక్రీయంగా, సాధారణంగా ఖాళీలు నిర్వహణ అధికారిచే నిర్ణయించబడిన తగుసమయం లోపల పూరించాలి.

ii) ఉపనిబంధన (2) :-

(ఎ) క్లాజ్ (ఎ) ని ఈ క్రిందివిధంగా మార్చారు.

(ఎ) పాఠశాల యాజమాన్య కమిటీ స్వరూపము దిగువ విధంగా ఉంటుంది.

ఎన్నుకోబడిన సభ్యులు (Elected Members) :

(1) ప్రతి తరగతి నుండి ముగ్గురి పిల్లల తల్లిదండ్రులు/ సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకోవాలి. వీరిలో ఒకరు సాధారణ వర్గం, ఒకరు ప్రతికూల వర్గం, ఒకరు బలహీన వర్గాలకు చెందినవారై ఉండాలి. ఇందులో కనీసం ఇద్దరు మహిళలై ఉండాలి.

అయితే, ఒక తరగతిలో 6గురు కన్నా తక్కువ పిల్లలు ఉన్నట్లయితే ఆ తరగతిని అంతకంటే ఎక్కువ లేదా తక్కువ తరగతితో కలిపి 6గురిని గాని ఎక్కువమందిని గాని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలి.

(2) ఎన్నుకోబడిన సభ్యుని కాలపరిమితి 2 సంవత్సరాలు, లేదా వారి పిల్లలు ఆ పాఠశాలను వదిలి వెళ్ళే సమయం వరకు వారు సభ్యులుగా ఉంటారు. ఈ రెండింటిలో ఏది ముందు జరిగితే అది పరిగణనలోకి తీసుకోవాలి.

(3) తమ పిల్లలు ఆ పాఠశాల వదిలి వెళ్ళిన కారణంగా తమ సభ్యత్వాన్ని కోల్పోయిన తల్లిదండ్రి/ సంరక్షకుని స్థానంలో ఆ పాఠశాలలో మొదటి తరగతిలో చేరిన విద్యార్థి/ విద్యార్థిని తల్లిదండ్రి/ సంరక్షకున్ని ఆ పాఠశాల యాజమాన్య కమిటీలోకి తీసుకుంటారు.

(బి) క్లాజ్ (బి) ని ఈ క్రిందివిధంగా మార్చారు.

(బి) పదవిరీత్యా సభ్యులు (Ex-officio Members) :

(1) పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.

(2) అదనపు సభ్యుడిగా టీచర్, మండల విద్యాధికారిచే నామినేట్ గావింపబడినపుడు ప్రధానోపాధ్యాయుని జెండర్‌కు వ్యతిరేక జెండర్ గలవారికి ప్రాధాన్యతనివ్వాలి.

(3) సంబంధిత ప్రాంత కార్పోరేటర్/ కౌన్సిలర్/ వార్డ్‌మెంబర్.

(4) నైబర్‌హుడ్ పాఠశాల ప్రాంతంలో సేవలందిస్తున్న అంగన్‌వాడి వర్కర్.

(5) నైబర్‌హుడ్ పాఠశాల ప్రాంతంలోని సేవలందిస్తున్న బహుళ ప్రయోజక ఆరోగ్య కార్యకర్త - స్త్రీ (ఎ.ఎన్.ఎం.)

(6) సంబంధిత గ్రామం / వార్డ్ మహిళా/ సమాఖ్య అధ్యక్షులు.

(సి) క్లాజ్ (సి) ని ఈ క్రిందివిధంగా మార్చారు.

(సి) సహ సభ్యులు (Co-opted Members) :

(1) పాఠశాలకు తోడ్పాటునందించే ఇద్దరు పేరుగాంచిన సహసభ్యులను విద్యావేత్త, దాత, స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న కార్యకర్త, అల్యుమినీ అసోసియేషన్‌కు (పూర్వవిద్యార్థి) లేదా ఆ పాఠశాల అభివృద్ధికి పనిచేస్తున్న ఎవరైనా వ్యక్తిని పాఠశాల యాజమాన్య కమిటీ యొక్క ఎన్నికైన సభ్యులచే కో-ఆప్ట్ చేసుకోవాలి.

(2) కో-ఆప్టెడ్ సభ్యుల పదవీకాలం కో-ఆప్షన్ జరిగిన తర్వాత జరిగే మొదటి సమావేశ తేది నుండి ఉంటుంది. రెండు సంవత్సరాలు ఉంటుంది.

(డి) క్లాజ్ (సి) తర్వాత ఈ క్రింది అంశాన్ని అదనంగా చేర్చాలి, ఏమనగా

(డి) స్థానిక-ప్రభుత్వ-చైర్ పర్సన్ : సంబంధిత గ్రామపంచాయితీ సర్పంచ్/ మున్సిపల్ ఛైర్‌పర్సన్/ మేయర్ వారి విచక్షణ మేర తమ అధికార పరిధిలో జరిగే ఏ పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలోనైనా పాల్గొనవచ్చు.

iii) ఉపనిబంధన (3)ని ఈ క్రింది విధంగా మార్చారు :-

3 ఎన్నుకోబడిన తమ సభ్యుల నుండి పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్‌ను/ వైస్ ఛైర్‌పర్సన్‌ను ఎన్నుకోవచ్చు. అయితే, వారిలో ఒకరు సామాజిక ప్రతికూల సమూహాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకుడై ఉండాలి, లేదా బలహీనవర్గాలకు చెందినవారై ఉండాలి.

iv) ఉపనిబంధన (4) ని ఈ క్రింది విధంగా మార్చారు.

4 (ఎ) సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లల తల్లిదండ్రుల వార్షిక సర్వసభ్య సమావేశాన్ని (ఆన్యువల్ జనరల్ బాడీ) పాఠశాలలు

తెరచి పిల్లల అడ్మిషన్లు ముగిసిన ఒక నెల లోపల నిర్వహించాలి.

(బి) ఆ పాఠశాలలో పనిచేసే అందరు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తప్పనిసరిగా తల్లిదండ్రుల/ సంరక్షకుల వార్షిక సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలి.

(సి) ప్రధానోపాధ్యాయులు గత విద్యాసంవత్సరంలో పాఠశాల సాధించిన అభ్యసన కార్యక్రమాలను మరియు ప్రస్తుత విద్యాసంవత్సర ప్రణాళిక నివేదికలను సమర్పించాలి.

(డి) సంబంధిత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆ పాఠశాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను, పాఠశాల నిర్వహణ సమస్యలను సంక్షిప్తంగా సభ్యులకు వివరించాలి.

(ఇ) ఆయా తరగతులకు సంబంధించి ఎన్నుకోబడిన సభ్యులు/ సభ్యురాళ్ళు పాఠశాల మొదటి తరగతికి సంబంధించి క్రొత్తగా చేరిన పిల్లలు తల్లిదండ్రులు/ సంరక్షకులను పాఠశాల యాజమాన్య కమిటీలో సభ్యులుగా మరియు అలాగే అసాధారణంగా ఏర్పడిన ఖాళీలను కొత్త సభ్యులతో ఎన్నికద్వారా భర్తీ చెయ్యాలి.

(ఎఫ్) పాఠశాల వార్షిక సర్వసభ్యసమావేశంలో జరిగే చర్చల్లో తల్లిదండ్రులిద్దరు కూడా పాల్గొనవచ్చు. అయితే పాఠశాల యాజమాన్య కమిటీకి సంబంధించి ఎన్నుకొనే తల్లిదండ్రుల/ సంరక్షకుల ఎంపిక విషయంలో పైన పేర్కొన్న వీరిలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుంది.

(జి) ఒక తల్లి లేక తండ్రి/ సంరక్షకుల పిల్లలు ఒక సమయంలో వేరు, వేరు తరగతుల్లో చదువుతున్నట్లయితే ఆయా తరగతుల కొరకు జరిగే ప్రతి ఎన్నికల కార్యక్రమంలో పాల్గొనడానికి అర్హులు.

(హెచ్) సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికలను నిర్వహించాలి.

(ఐ) పాఠశాల యాజమాన్య కమిటి ఎన్నికలు నిర్వహించడానికి తల్లిదండ్రులు/ సంరక్షకుల్లో కనీసం 50శాతం మంది హాజరుకావాలి.

(జె) ఎన్నికలు చేతులెత్తే విధానంలో జరిగేటప్పుడు నోటిమాటతో తమ అంగీకారాన్ని తెలుపవచ్చు. సమస్య తీరని రీతిలో అసాధారణ పరిస్థితి ఏర్పడితే రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించవచ్చు.

v) ఉపనిబంధన (5) ని ఈ క్రింది విధంగా మార్చారు.

(4) (ఎ) ఒక విద్యాసంవత్సరంలో పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతి రెండు నెలలకొకసారి తప్పనిసరిగా సమావేశం నిర్వహించాలి. మొదటి సమావేశాన్ని విద్యాసంవత్సర ఆరంభంలో నిర్వహించాలి. విద్యా సంవత్సరం ముగింపు సమయంలో నిర్వహించే సమావేశంలో ఆ విద్యా సంవత్సరంలో పిల్లల విద్యా ప్రగతి, పాఠశాల కార్యక్రమాలను సమీక్షించాలి.

(బి) ఎప్పుడైనా, ఎన్నుకోవడిన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యుడు, సభ్యురాలు ఒక నిర్ధిష్ట ఎజెండాలో సమావేశాన్ని నిర్వహించాలని హెడ్‌టీచర్‌ను కోరినట్లైతే, అతడు/ ఆమె పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ ముందస్తు అనుమతితో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలి. లేదా ఆ నిర్ధిష్ట ఎజెండాను తర్వాత పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశంలో ఎజెండాలో పొందుపరచి, చర్చించాలి.

(సి) పాఠశాల యాజమాన్యంలో ప్రభావవంతమైన పర్యవేక్షణ ఉండేందుకు, విద్యాహక్కు చట్టాన్ని సక్రమంగా అమలుపరచేందుకు పాఠశాల యాజమాన్యకమిటీ మధ్యాహ్న భోజన పథకం, విద్యాప్రగతి, పాఠశాల నిధులు మరియు ఖర్చు, సోషల్ ఆడిట్ వంటి యాజమాన్య కీలక అంశాల అమలుకు కొన్ని ఉపకమిటీలను వేసుకోవచ్చు.

(డి) పాఠశాల హెడ్‌టీచర్ లేదా టీచర్ పాఠశాల యాజమాన్య కమిటీ, నిర్ణయాలను, తీర్మానాలను రికార్డు చేసి, అందరి సభ్యులకు చదివి వినిపించాలి. లేదా ఒక ప్రతిని అందించాలి.

vi) ఉపనిబంధన (6) ని ఈ క్రింది విధంగా మార్చారు.

(6) పాఠశాల యాజమాన్య కమిటీ, ఈ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్-21 (2)లో పేర్కొన్న విధులతో పాటు ఈ క్రింది విద్యావిధులను నిర్వర్తిస్తుంది.

(ఎ) పాఠశాలలో బోధిస్తున్న పాఠ్యాంశాల సిలబస్‌ను తరచుగా సమీక్ష చేసి, దీనిద్వారా వచ్చిన ఫలితాలను సమీక్షించాలి.

అదేవిధంగా చదవడం, రాయడం, సరళమైన లెక్కలు చేయడం, ఇంగ్లీషు భాష పరిజ్ఞానం వంటి అంశాల్లో పిల్లల ప్రగతిని పరీక్షించాలి. ఇందుకుగాను అనిర్ధిష్టంగా ప్రతి తరగతి నుండి పిల్లలను తీసుకొని వారు తమ ప్రగతి

ప్రదర్శిస్తుండగా వారి సామర్థ్యాన్ని అంచనా వెయ్యాలి. అదేవిధంగా, పిల్లల, టీచర్ల గైర్హాజరు మీద శ్రద్ధ పెట్టి దీన్ని తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలి.

(బి) నైబర్‌హుడ్ పాఠశాల పరిధిలో ఉండే పిల్లలందరూ పాఠశాలలో నమోదు కావడమే కాక వారందరూ క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చూడాలి.

(సి) నైబర్‌హుడ్ పాఠశాల పరిధిలో నివసించే కుటుంబాలకు చెందిన 6 నుండి 14 సంవత్సరాల లోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లల, వలస కుటుంబాల పిల్లల జాబితాను నిర్వహించాలి. బడి బయటి పిల్లలను వారి వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చడానికి పాఠశాల యాజమాన్య కమిటీ ప్రభావవంతమైన చర్యలు చేపట్టాలి.

(డి) పాఠశాలలో హాజరు శాతాన్ని బోధన మరియు ఇతర సిబ్బంది అందుబాటును, సమీక్షించి పర్యవేక్షణ చెయ్యాలి.

(ఇ) పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించాలి.

(ఎఫ్) ఆ పాఠశాలకు సంబంధించిన వార్షిక ఆదాయ, వ్యయ లెక్కలను సిద్ధపరచాలి.

vii) ఉపనిబంధన (7) ని ఈ క్రింది విధంగా మార్చారు.

(7) పాఠశాలకు సంబంధించిన ఎలాంటి నిధులైనా పాఠశాల యాజమాన్య కమిటీ అకౌంట్‌లో జమచెయ్యాలి. ఈ అకౌంట్ అడిట్ చేయడానికి అందుబాటులో ఉంచాలి. ప్రతి సంవత్సరం ముగింపు సమయంలో తమకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ అధికారులకు ఈ కమిటీ నిధులు మంజూరుచేసిన ప్రభుత్వ అధికారులకు ఈ కమిటీ నిధుల ఉపయోగానికి సంబంధించిన సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది.

viii) ఉపనిబంధన (8) ని ఈ క్రింది విధంగా మార్చారు.

(8) పాఠశాల యాజమాన్య కమిటీ లెక్కలను ఆడిట్ చేయడం అనేది పాఠశాల అభివృద్ధికి నిధులు ఇచ్చే ప్రభుత్వ శాఖ అధికార పరిధిలో ఉంటుంది. ఈ శాఖ ఈ విషయాన్ని ఏదైనా ఏజెన్సీకి, బృందానికి అప్పగించవచ్చు.

(గవర్నర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి పేరుతో ఈ ఉత్తర్వు అధికారికంగా ప్రకటించబడింది).

**కాపీలు ఈ క్రిందివారికి :**

- ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజేశ్వర్ తివారి (పి.ఇ.) (ఎఫ్.ఏ.సి.)
- కమీషనర్ ప్రింటింగ్ మరియు స్టేషనరీ, చంచల్‌గూడ, హైదరాబాద్, ఎ.పి.గెజిట్ (అసాధారణ) తేది : 24.06.2013న ప్రచురించడానికి ఉద్దేశించి ఈ నకలును జతపరిచి అభ్యర్థించడమైనది మరియు స్కూల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ శాఖకు 1000 కాపీలు సరఫరా చేయాలని కోరడమైనది.
- కమీషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఎ.పి. హైదరాబాద్.
- స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, రాజీవ్ విద్యా మిషన్ (ఎస్.ఎస్.ఏ), ఎ.పి., హైదరాబాద్.
- డైరెక్టర్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎస్.సి.ఇ.ఆర్.టి.), ఎ.పి. హైదరాబాద్.

**ఈ క్రిందివారికి కాపీ జతపరచడమైనది:**

- సెక్రెటరీ, కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ శాఖ మరియు అక్షరాస్యత, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ.
- గౌరవ ముఖ్యమంత్రివారి, స్పెషల్ సెక్రెటరీ వారి పర్సనల్ సెక్రెటరీకి.
- గౌరవ మంత్రివర్యులు (పి.ఇ. మరియు ఎస్.ఎస్.ఏ.) వారి పర్సనల్ సెక్రటరీకి.
- ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, వారి పర్సనల్ సెక్రటరీకి
- ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రాథమిక విద్య, ఎ.పి. సెక్రెట్రియేట్ వారి పర్సనల్ సెక్రటరీకి.
- సాధారణ ప్రభుత్వ (కేబినెట్) శాఖ.
- న్యాయ (ఎ) శాఖ
- ఆర్థిక శాఖ
- స్కూల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులందరికి.
- పబ్లిసిటీ సెల్, ఇన్‌ఫర్మేషన్ మరియు పబ్లిక్ రిలేషన్స్ ప్రభుత్వ శాఖ, ఎ.డి. సెక్రెటేరియట్.
- ఎస్.సి./ ఎస్.టి.

// ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా పంపబడింది //

సెక్షన్ ఆఫీసర్